

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం fb.com/vaartha

PUBLISHED FROM RAJAHMUNDRY, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

10-10-2022 సోమవారం సంపుటి : 28 సంచిక : 250, పేజీలు : 10+4 వెల : 6.50



నటి సోనాలీ హత్యవెనుక రూ. 10కోట్ల డీల్ ! 5లో

'కాంగ్రెస్‌కు రాహుల్ ఒక్కడే ప్రత్యామ్నాయం'


# మధ్యతరహా ప్రాజెక్టులకు ప్రాధాన్యం



## నైపుణ్యాభివృద్ధి రంగాల్లో యువతకు ఉపాధికల్పన

## కొత్త పారిశ్రామిక విధానం అమలులో ప్రత్యేక బాధ్యత

## కార్మికుల భద్రతకు చర్యలు: సిఎం జగన్

**విజయవాడ, అక్టోబరు9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ) ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తామని సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి పునరుద్ఘాటించారు. నైపుణ్యాభివృద్ధి రంగాల్లో యువతకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఇందుకు వీలుగా ప్రభుత్వపరంగా పెట్టుబడి.విద్యుత్తు చార్జీలు తదితరంశాల్లో రాయితీలు కల్పిస్తామన్నారు.ఉద్యోగ అవకాశాలను యువతకు అందుబాటులోకి తీసుకుని రావడానికి అనుగుణంగా పారిశ్రామిక వ్యవస్థను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని సిఎం జగన్ అధికారులకు కీలకాదేశాలు జారీ చేసారు. ఆ దిశలో పురోగతిపై ఆయన అధికారులనుంచి ఎప్పటికప్పుడు సమాచార నివేదికలను తెప్పించుకుంటున్నారు.ఈ సందర్భంలోనే సిఎం జగన్ అధికారులు. నూతన పారిశ్రామిక విధానాన్ని ఉపాధి అవకాశాలకల్పన, ప్రాంతాల నడుమ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణాంశాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించాలన్నారు.ప్రస్తుతం వున్న పరిశ్రమలు మరింత మెరుగ్గా నడిచే విధంగా చేయడంతో పాటు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ దిశగా కేంద్రీకరించి కార్యచరణ ప్రణాళికను అమలు చేయనున్నట్లు అధికారులు సిఎం జగన్‌కు తెలిపారు.

మౌలిక సదుపాయాలు,నైపుణాభివృద్ధి రంగాల్లో కీలక చర్యల ద్వారా పారిశ్రామిక ప్రగతికి తోడ్పాటును అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు, పరిశ్రమల స్థాపనలో ఉన్న కాల జాప్యాన్ని తగ్గించడం, అందుకోసం మౌలిక సదుపాయాలను వృద్ధి చేయడం. వెనుకబడిన వర్గాల సామాజికాభివృద్ధికి ప్రత్యేక చర్యలను చేపట్టే విధంగా పలు అంశాలు పారిశ్రామిక పాలసీలో అంతర్భాగంగా ఉన్నట్లు అధికారులు గత నివేదికలను సిఎం జగన్‌కు ప్రస్తావించి ఆ దిశలో చర్యలు ఎంత వరకు వచ్చింది అడిగి తెలుసుకుంటున్నారు. అధికారులు పారిశ్రామిక విధాన ముసాయిదాలో ప్రతిపాదించిన అంశాలు సంతృప్త స్థాయిలో ఉన్నప్పటికి మరింత వేగవంతంగా ఆ దిశలో కార్యచరణ ఉండాలని అధికారులకు కొన్ని కీలక సూచనలు చేసారు.ఎంఎస్ఎంఈల అభివృద్ధికి పూర్తిగా ప్రాధాన్యతను ఇవ్వాలని అధికారులకు సిఎం జగన్ సూచించారు.వస్త్ర తయారీ పరిశ్రమలకు నెలవైన ఎపిలో 'టోరె' సహా ఎన్నో పరిశ్రమలు ప్రతీకలుగా నిలిచాయని తెలిపారు. వస్త్ర పరిశ్రమ ప్రగతిలో మరింతగా రాణించేందుకు అన్వేషించాల్సిన మార్గాలపై, వనరులను ఉపయోగించుకుని కొరతలు, వలసలను తగ్గించి ఉపాధి అవకాశాలను కల్పించడం, ఎంఎస్ఎంఈల పట్ల ప్రత్యేక శ్రద్ధను కనపర్చాలన్నారు.

ఈ క్రమంలో ప్రతిజిల్లాలో మూడో జాయింట్ కలెక్టరుకు ఎంఎస్ఎంఈల బాధ్యతను అప్పగిస్తోందని తెలిపారు.జిల్లా ల్లో పరిశ్రమల అవసరాలు గుర్తించాలన్నారు ప్రభుత్వ విభాగాలు కొనుగోలు చేసే వస్తుసేవల్లో కనీసం 25 శాతం సూక్ష్మ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల నుంచి కొనుగోలు చేసే విధంగా ఆదేశాలు జారీ చేసామన్నారు. అందులోను నాలుగు శాతం ఎస్సీ,ఎస్టీ మహిళా యాజమాన్యాలు నిర్వహిస్తున్న సంస్థల నుంచి కొనుగోలు చేస్తామన్నారు.ఇలా చేసిన కొనుగోళ్లకు చెల్లింపులు ఎప్పటికప్పుడు జరుగుతాయని స్పష్టం చేసారు. ఎంఎస్ఎంఈలకు టెండరు సెట్ల ఫీజు, కనీస టర్నోవరు నిబంధనల నుండి మినహాయింపును ఇస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం సూక్ష్మ, చిన్న.మధ్య తరహా పారి శ్రామిక రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన ప్రభుత్వం ఎంత గుణాత్మకంగా వ్యవహరిస్తోందో,అదే దిశలో కార్మికుల ≫2



ఆదివారం గుజరాత్‌లోని మోథేరా గ్రామంలో సోలార్ ప్లాంట్లను ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

## దేశంలో తొలి 'సూర్య గ్రామం'

**గుజరాత్‌లోని మోథేరా అంతటా సౌరవిద్యుత్ వెలుగులే**

**నేడు మరిన్ని ప్రాజెక్టులు ప్రారంభం**

**గాంధీనగర్, అక్టోబరు 9:** దేశంలోని మొట్టమొదటి సంపూర్ణ సోలార్‌విద్యుత్‌గ్రామాన్ని ప్రధానిమోడీ ప్రకటించారు. మూడురోజుల పర్యటనకోసం గుజరాత్‌కువెళ్లిన ప్రధానిమోడీ ఆదివారం సాయంత్రం దేశంలోనే తొలి 24 గంటలుపనిచేసే సోలార్ విద్యుత్‌గ్రామంగా మెహసానా జిల్లాలోని మోఢేరా గ్రామాన్ని ప్రకటించారు.ప్రాంత ప్రజలకు శరద్‌పూర్ణిమ, వాల్మీకి జయంతి శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని సూర్యదేవాలయం ఉన్న గ్రామంగా మోఢేరా దేశానికి తెలుసనని ఇకపై ≫2



## వికేంద్రీకరణ ఉద్యమం ఉధృతం చేస్తాం

**మా ప్రభుత్వానికే విజన్ ఉంది: మంత్రి ఆదిమూలపు**

**ఒంగోలు, అక్టోబరు 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని వికేంద్రీకరణపై మంత్రి ఆదిమూలపు సురేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజధాని కోసం అంటూ పాదయాత్ర చేస్తున్న వాళ్లు రైతుల్లా కనిపించడం లేదని ఆరోపించారు. ఓ అజెండా ప్రకారం చంద్రబాబు చెప్పినట్లుగా వారు చేస్తున్నారన్నారు. పాదయాత్రలో పాల్గొన్న వాళ్ల చంద్ర ≫2

## దేవిక కుటుంబానికి 10 లక్షల సాయం

**సిఎం జగన్ వెల్లడి**

**విజయవాడ,అక్టోబరు9, ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడ జిల్లా కాండ్రేగుల కురాడ గ్రామంలో పెళ్లికి నిరాకరించదనే కక్షతో ఓ ఉన్మాది హత్య చేసిన దేవిక కుటుంబానికి సిఎం జగన్ రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా సీఎం జగన్ హతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. దేవిక కుటుంబాన్ని అధికారులు పరామర్శించి వారికి భరోసా కల్పించాలన్నారు. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందనే విషయాన్ని స్పష్టంగా వివరించాలన్నారు. ఇప్పటికే సిఎం ఈకేసులో దిశ చట్టప్రకారం నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కాకినాడ జిజిహెచ్‌లో రిమాండ్ ఖైదీ మృతి

**కాకినాడ, అక్టోబరు 9, ప్రభాతవార్త బ్యూరో:** రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కృష్ణా జిల్లాకు చెందిన పళని హారీష్‌కుమార్ (38) కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కాకినాడ 1వ పట్టణ పోలీసులు తెలిపారు. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన హారీష్‌కుమార్ హత్యా నేరంతో ఈ ఏడాది జూన్ నెలవరకూ కృష్ణాజిల్లా సబ్ జైలులో ఖైదీగా ఉండేవాడు. ఆ తర్వాత రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఇతను గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించిన సెంట్రల్ జైలు సిబ్బంది రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఈనెల 7వతేదీన కాకినాడ జిజిహెచ్‌కు తీసుకువచ్చారు. జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం అర్థరాత్రి మృతి చెందినట్లు జిజిహెచ్ వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మృతిపై స్థానిక 1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

## అందరి ఐక్యతకే భారత్ జోడో..



**దేశాన్ని కుల, మతాల వారీగా విభజిస్తున్న బిజెపి**

**ఆరెస్సెస్, బిజెపి నేతలు దేశానికి ఏంచేశారు?**

**ఇందిర, రాజీవ్ దేశం కోసం ప్రాణాలిచ్చారు**

**ఎఐసిసి అధ్యక్ష అభ్యర్థి మల్లికార్జున ఖర్గే**

**విజయవాడ, అక్టోబరు 9,ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ అధ్యక్షునిగా పోటీ చేసే అరుదైన అవకాశం తనకు వచ్చిందని ఆ పార్టీ సీనియర్ నేత, ఎఐసిసి అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్న నాయకులు మల్లిఖార్జున ఖార్గే అన్నారు.తనను ఎన్నుకుంటే, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఉన్న కాంగ్రెస్ నాయకులను ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞప్తి ఏస్తున్నారు. ఇందులో భాగంగా ఈ రోజు తెలుగు రాష్ట్రాల్లో ఆయన పర్యటించారు. ఉదయం హైదరాబాద్‌కు వచ్చిన మల్లిఖార్జున ఖార్గే మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఎపి తరపున ఎపిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్ స్వాగతం పలకగా, సీనియర్ నేతలు కెవిపి రామచంద్రరావు,కొప్పుల రాజు, జెడి శీలం,గిడుగు రుద్రరాజు, మస్తాన్‌వలి, తులసీరెడ్డి, హర్ష కుమార్‌లు వారితో పాటు ఉన్నారు. అక్కడి నుండి ర్యాలీగా విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి తీసుకువచ్చారు.

ఎఐసిసి అధ్యక్ష ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న ఎపి పక్షాన కర్నూలులో ఏర్పాటు చేసి ఎన్నికలకేంద్రంలో 350మంది పిసిసి డెలిగేట్లు ఓటు వేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులతో ప్రత్యేకంగా ఆయన సమావేశమయ్యారు. తన మనసులోని బావాలు ఆలోచనలను వారికి వివరించారు.ఈ నెల 17న జరిగే ఎఐసిసి అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం తాను విజయవాడ వచ్చానని, అందరూ మద్దతు తెలపాలని, పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధ్యక్షునిగా పోటీ చేసి అరుదైన అవకాశం తనకు వచ్చిందని, తాను ఇప్పటికే పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా ఉన్నానని గుర్తు చేశారు. సుదీర్ఘ కాలం పాటు కర్ణాటక రాష్ట్రంలో రాజకీయం ≫7

## ప్రతి రూపాయికి లెక్కలున్నాయి..



**రూ.1,70,000 కోట్లను డివిటి ద్వారా ప్రజలకు నేరుగా ఇచ్చాం**

**మూల ధన వ్యయం మెరుగుపడింది**

**వేస్ అండ్ మీన్స్ అనేది రిజర్వు బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించిన సదుపాయం**

**ఓవర్ డ్రాఫ్ట్ అనేది అదనపు అప్పు కాదు**

**టిడిపి ప్రభుత్వ హయాంలో 8.49 శాతానికి అప్పు తెస్తే, మేం 6.96 శాతానికి తెచ్చాం**

**ప్రతిపక్షాలవన్నీ అసత్య ఆరోపణలు: ఆర్థిక మంత్రి బుగ్గన**

**సచివాలయం. అక్టోబరు 9. ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు నేరుగా అంది వారి అవసరాలు తీరుతుంటే అది చూసి ఓర్వలేక టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, ఇతర టిడిపి నేతలు ప్రభుత్వంపై అసత్య అరోపణలు చేస్తున్నారని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, ఉపాధి శిక్షణ, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాధ్ విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజల సంక్షేమంకోసం అనేక పథకాలను అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ అన్నారు. అయితే ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆయన పార్టీ నేతలు ఎపి మరో శ్రీలంకగా మారబోతోందని కొన్ని నెలల క్రితం అసత్య ప్రచారం చేశారు, ఇప్పుడెమో నైజిరియా, జింబాబ్వే అంటూ మరోసారి అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2020-21 సంవత్సరంలో కరోనా మహామ్మారి ప్రపంచ వ్యాప్తంగా విజృంభించింది. మన రాష్ట్రంలో కూడా కరోనా విలయతాండవం చేసింది. కరోనా వలన రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం సుమారు రూ.8 వేల కోట్లు తగ్గింది. కరోనా సమయంలో మహామ్మారి కట్టడికి, కోవిడ్ వైద్యానికి, టెస్టింగ్‌లకు, కోవిడ్ సెంటర్‌ల నిర్వహణకు, ఉచిత బియ్యం సరఫరాకు అదనంగా రూ.7130 కోట్లు అయిందన్నారు. కరోనా వలన పేద, మధ్య తరగతి ప్రజలు ఇళ్ల నుండి బయటకి రాలేక ఉపాధి కోల్పోయారు. ఇలాంటి తరుణంలో ప్రజల ప్రాణాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వానికి ఆదాయవనరులు పడిపోతున్నా డిబిటి ద్వారా ప్రజల ఖాతాల్లో నేరుగా రూ.57,512 కోట్లు జమ చేసి ప్రజలను ఆదుకున్నా ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్ర అప్పులు 8 లక్షలకోట్లు అనే లెక్కలు ఎక్కడ నుంచి వచ్చాయో మాకు తెలీదు, అది పచ్చిఅబద్ధమన్నారు. వాస్తవాలు, గణాంకాలతో రుజువుచేయగలరాని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. రాష్ట్ర అప్పు పబ్లిక్ సెక్టార్‌యూనిట్ల తీసుకున్న అప్పులుతో కలుపుకొని రూ.1,71,176 కోట్లు అనే విషయాన్ని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. గత టిడిపి ప్రభుత్వం 2019లో దిగిపోతూ రూ.40 వేల కోట్ల వర్క్‌ల బిల్లులను పెండింగ్ పెడితే, ఆ బిల్లులు మన ప్రభుత్వంపై పెనుభారం అయినాయన్నారు. విద్యుత్ కొనుగోలు మరియు పంపిణి సంస్థలకు సంబంధించిన అప్పును రూ.46,200 కోట్లు మేర అదనంగా పెంచేసి విద్యుత్ రంగాన్ని కోలుకోలేని రీతిలో దెబ్బతిశారని విమర్శించారు. దురదృష్టకరమైన రాష్ట్ర ≫2

## 3 రాజధానులు ఓ నాటకం

**•ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి •కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 సూత్రాలు అమలు •ఎపికి ప్రథమ ద్రోహి కెసిఆర్**



**కుప్పం, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఎపిలో మూడు రాజధానుల అంశం ఓ నాటకమని సచివాలయం ఎక్కడ ఉంటే దాన్నే రాజధానిగా పిలుస్తారని ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి డా॥ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం అన్నీ ఉన్నాయన్నారు. అమరావతి రాజధాని రాయలసీమకే అనుకూలమని విశాఖకు తరలిస్తే నష్టపోయేది రాయలసీమేనన్నారు. కర్ణాటకలోని బెంగళూరు, బెల్గాంలో రెండు అసెంబ్లీలు ఉన్నాయని అలాగని బెల్గాం కర్ణాటక రాజధాని అయిపోతుందా అని ప్రశ్నించారు. అవసరం ఉంటే వైజాగ్‌లో అసెంబ్లీ కట్టుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రభంజనంలా కొనసాగుతోందన్నారు. ఇప్పటికే కేరళ, తమిళనాడులో ప్రజలు బ్రహ్మరథం పట్టారని ప్రజల్లో కాంగ్రెస్ రావాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఈనెల 14న రాయదుర్గం మండలం డి.హీరేహాళ్, ఓబుళాపురంలో రాహుల్ పాదయాత్ర ప్రవేశిస్తుందన్నారు. అనంతరం ఈనెల 18-22 తేదీల్లో కర్నూలు జిల్లాలో 98కి.మీ.ల పాదయాత్ర ఉంటుందన్నారు. తెలంగాణా సిఎం కెసిఆర్ ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రథమ ద్రోహి అని నిప్పులు చెరిగారు. కెసిఆర్ ఏర్పాటుచేసిన భారత రాష్ట్ర సమితి '(బిఆర్ఎస్) పార్టీ ఎపిలో విఆర్ఎస్‌గా ఉంటుంద ≫2



## దేశమంతా తిరుమలేశుని వైభవోత్సవాలు

**డిసెంబర్‌లో ఒంగోలు, జనవరిలో ఢిల్లీ**

**అహ్మదాబాద్‌లో ఆలయానికి త్వరలో భూమిపూజ : టిటిడి ఇఒ ధర్మారెడ్డి** 2లో

## వైఎస్సార్సీ నేత దారుణ హత్య



హత్యకు గురైన రామకృష్ణారెడ్డి (ఫైల్)

**పిఎం రిపోర్టులో 21 చోట్ల కత్తిపోట్లు**

**మృతదేహంతో రాస్తారోకో**

**కుటుంబానికి సిఎం జగన్ ఫోన్‌లో పరామర్శ**

**హిందూపురం, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ప్రశాంతతకు మారుపేరు అయిన హిందూపురంలో వైఎస్సార్సీ మాజీ సమన్వయకర్త చౌళూరు రామకృష్ణారెడ్డి స్వగ్రామం చౌళూరులో తన ఇంటి వద్ద దారుణహత్యకు గురికావడంతో ఈ ప్రాంతవాసులు ఉలిక్కిపడ్డారు. రాజకీయవర్గాల్లో తీవ్ర కలకలం రేపిన సంఘటనకు సంబంధించి వివరాలు.... వైఎస్ జగన్ పార్టీ పెట్టినప్పటినుండి ఈ ప్రాంతంలో జెండా పట్టిన తొలి నేతగా సమన్వయకర్తగా గుర్తింపుపొందిన చౌళూరు రామకృష్ణారెడ్డి (రాము)ను గుర్తుతెలియని వ్యక్తులు కళ్లల్లో కారం కొట్టి వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపగా పోస్టుమార్టం రిపోర్టులో 21 చోట్ల నరికిన గుర్తులు కనిపించాయి. హత్య జరిగిన సమయం దాదాపు 9 గంటలప్రాంతం నుండి ఈ ప్రాంతం వైఎస్సార్సీ కార్యకర్తల ఆందోళనలతో ఉద్రిక్తత తలెత్తింది. ఆసుపత్రికి తరలించేలోపే చనిపోగా రాత్రికి రాత్రి జిల్లా ఎస్‌పి, ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కాగా వైఎస్సార్సీ నియోజకవర్గం ఇన్‌చార్జ్, ఎంఎల్‌సి మహమ్మద్‌ఇక్బాల్ వ్యతిరేక వర్గంలో ఒకరుగా వున్న చౌళూరు రాము హత్యకు గురికావడం పార్టీ విభేదాలే కారణమని ఇది రాజకీయ కక్షతోనే జరిగిందని మృతుని తల్లి నారాణయమ్మ తీవ్రంగా ఆరోపించింది. ఎంఎల్‌సి ఇక్బాల్‌తో పాటు పిఎ గోపి, రవికుమార్, మాజీ ఎంపిపి నంజుండరెడ్డి, తదితరులు హత్య చేశారని ఆమె తీవ్ర ఆవేదనతో మీడియాకు తెలిపింది. ఆసుపత్రికి వచ్చిన అర్బన్ సిఐ జిటి నాయుడు, ఇతర పోలీసులను ఉద్దేశించి మీరే ఈ హత్య చేయించారని కూడా ఆమె ఆరోపించింది. ≫7

# అచ్చంపేటలో టిటిడి కల్యాణమండపాన్ని ఆధునీకరించండి

## శ్రీవారిసేవ ఆన్‌లైన్ బుకింగ్‌కు దళారులు బెడద

## అన్నప్రసాదం బియ్యం నాణ్యతగా లేదు

## 'డయల్ యువర్ ఇఒ'కు ఫిర్యాదు



**తిరుమల, అక్టోబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** అచ్చంపేటలో టిటిడి నిర్మించిన కల్యాణ మండపంలో సంవత్సరానికి ఒక పెళ్లికూడా జరగడం లేదని, దానిని ఆధునీకరించి అభివృద్ధిచేయాలని అచ్చంపేటవాసి నాగ కోరారు. దీనిపై ఇఒ ఏవి ధర్మారెడ్డి స్పందిస్తూ టిటిడి అధికారులు సందర్శించి నిర్ణయం తీసుకుంటారని, టిటిడి కల్యాణ మండపాలను వివిధ వ్యక్తులు, సంస్థలకు 10 సంవత్సరాలు లీజుకు ఇస్తున్నామన్నారు. కరీంనగర్ నుంచి మహేందర్‌రావు మాట్లాడుతూ ఇదివరకు శ్రీవారిసేవకు ఆఫ్‌లైన్‌లో ఉండేదని, ఆన్‌లైన్ చేయడం ద్వారా దళారులు ఒక్కొక్కరికి 400 రూపాయలు వసూలుచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన ఇఒ చాలా మంది సేవకులు ఈ విషయంగా ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో నేరుగా బుక్‌చేసుకునే సదుపాయం కల్పించాం. ఇంటర్‌నెట్ కేంద్రాల వాళ్లు కొంత చార్జ్ చేస్తారని, దళారులకు డబ్బులు ఇవ్వకండన్నారు. విశాఖపట్నంనుంచి వెంకటరమణ మాట్లాడుతూ అన్నప్రసాదంలో వినియోగించే బియ్యం నాణ్యత లేదని, నాణ్యతను పెంచాలని కోరారు. ఈ ప్రశ్నకు స్పందించిన ఇఒ ధర్మారెడ్డి అన్నప్రసాదాలు రుచిగా, శుచిగా అందిస్తున్నారు. బియ్యం నాణ్యతను పెంచేందుకు మిల్లర్స్‌తో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు భక్తులు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులుచేశారు. చెన్నైనుంచి మహేష్ బాబు మాట్లాడుతూ టిటిడి విశ్రాంత ఉద్యోగులకు వారివారి స్వస్థలాలలో వడ, లడ్డూ ,డైరీ క్యాలండర్ ఇచ్చే అవకాశం కల్పించండని కోరారు. దీనిపై ఇఒ సానుకూలంగా స్పందిస్తూ ఇచ్చే అవకాశం పరిశీలిస్తామన్నారు. జమ్మలమడుగునుంచి పుల్లయ్య, హైదరాబాద్‌నుంచి పురుషోత్తం మాట్లాడుతూ శ్రీవారి ఆర్జితటిక్కెట్లు ఆఫ్‌లైన్‌లో ఇవ్వండని కోరారు. ఈ విషయంగా ఇఒ సమాధానమిస్తూ తిరుమలలో ప్రతిరోజూ లాటరీ విధానంలో టిక్కెట్లు పొందవచ్చు.ప్రతి శుక్రవారం 10 అభిషేకం,2 వస్త్రం సేవా టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. మడకశిరనుంచి రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సర్వదర్శనానికి 48గంటలు పడుతుండటంతో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసి సామాన్యులకు పెద్దపీటవేయగలరని కోరారు. ఇందుకు స్పందించిన ఇఒ ధర్మారెడ్డి వారాంతంలో శుక్ర,శని,ఆదివారాలు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశామన్నారు.
ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్,సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇ 2 జగదీశ్వర్‌రెడ్డి, రవాణా జిఎం శేషారెడ్డి, ఆరోగ్యఅధికారిణి డాక్టర్ శ్రీదేవి, కేటరింగ్ అధికారి శాస్త్రి, వసతి కల్పన డిప్యూటీ ఇఒ భాస్కర్, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి, విజిఓ బాలిరెడ్డి, ఏపిఆర్ఓ నీలిమారావు తదితరులు పాల్గొన్నారు.



# తిరుమలలో అనూహ్య రద్దీ

**తిరుమల,అక్టోబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** దసరా సెలవులు...పెరటాసి మాసం వారాంతంలో రెండవ శని,ఆదివారాలు కావడం,జోరు వాన కురుస్తున్నా తిరుమలలో ఆదివారం ఉదయం కూడా భారీగా భక్తులు ఉన్నారు. గత నాలుగురోజుల నుంచి పెరిగిన అనూహ్యభక్తుల రద్దీతో ఆదివారం సాయంత్రానికి 24గంటలు సర్వదర్శనానికి నిరీక్షిస్తున్నారు. అనూహ్య భక్తుల రద్దీతో కొండ కిటకిటలాడుతోంది. నాలుగుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి. ఏడుకొండలవాడ ఎక్కడున్నావయ్యా... తమకు నీ దర్శనమెప్పుడుస్వామీ అంటూ చేతులెత్తి మొక్కుతున్నారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు అల్లంతదూరం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతుండగా సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. టిటిడి అధికారులు శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. సాయంత్రం వరకు 55వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. అడపాదడపా జోరువాన, చిరుజల్లులు కురుస్తుండటంతో క్యూలైన్లలో భక్తులు తడుస్తూ, చలికి వణుకుతూ అవస్థలు పడుతున్నారు.



# ప్రపంచంలోనే ఎపి నంబర్‌వన్

## రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

**తిరుమల,అక్టోబరు 9ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే 20ఏళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే కాదు... ప్రపంచంలోనే నంబర్1 రాష్ట్రంగా రూపుదిద్దు కుంటుందని రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశంలోనే ఆదర్శవంతంగా ఉందన్నారు. పేద వర్గాలు ఎలా అభివృద్ధి చెందుతారో సిఎం జగన్ ఆలోచనచేసి,ఎంతో అనుభవమున్న సంస్కరణ వాదిగా, విప్లవవాదిగా బ్రహ్మాండమైన పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. జగన్ పేదవర్గాల సిఎం అని అన్నారు. లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఏపిలో సంక్షేమపథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఏపికి మరింత బడ్జెట్ వచ్చేలా చేసి,రాష్ట్రప్రజల సర్వతోముఖాభివృద్ధికి ఆశీర్వదించాలని శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు కృష్ణయ్య తెలిపారు .వైసిపి నుంచి రాజ్యసభకు ఎన్నికైన కృష్ణయ్య తొలిసారిగా ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని విఐపి బ్రేక్‌లో వెంకన్నను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# సామాన్యుల చెంతకు అంతరిక్ష ప్రయోగాలు

**శ్రీహరికోట (తడ), అక్టోబరు 9 ప్రభాతవార్త:** దేశంలో సామాన్య జనాలకు అంతరిక్ష ప్రయోగాల వల్ల ఫలితాలు అందుబాటులోకి వచ్చాయని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి పేర్కొన్నారు. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. పాండిచ్చేరిలోని కరైకల్ స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం అక్కడి విద్యార్థుల మధ్య ప్రసంగించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాండిచ్చేరిలో మూడురోజుల పాటు అంతరిక్ష విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించారు. అక్కడ పలు ఎగ్జిబిషన్లలో రాకెట్లు, ఉపగ్రహాల నమూనాలను ఏర్పాటు చేసి విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాపై ఆసక్తి పెంచారు. ఈ సారి పుదుచ్చేరిలోనూ ఈ ఉత్సవాలు జరపడంతో దక్షిణాదిలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు అంతరిక్ష కార్యక్రమాలు తీసుకెళ్లినటయింది. ఇదిలావుంటే తమిళనాడులోని వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) కళాశాలలో ఆదివారం ముగింపు వేడుకలు కన్నులపండుగలా జరిగాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన విట్ కళాశాలలోని చెన్నారెడ్డి ఆడిటోరియంలో షార్ ఆధ్వర్యాన ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంచిపెట్టారు. షార్ సీజీఎం ఎస్.శంకరన్, ఆర్.రామకుమార్‌ల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు జరగ్గా, అక్కడి కలెక్టర్ కుమారవేల్ పాండియన్, విట్ అధికారులు పాల్గొన్నారు. చెన్నైలోని హిందుస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హిట్స్) కళాశాలలోనూ ఆదివారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొనడంతో పాటు ప్రసిద్ధి చెందిన అన్నా యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆర్.వేల్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హిట్స్ ఛాన్స్‌లర్ ఎలిజిబెత్ వెర్గీస్, ఇతర అధికారులతో పాటు షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.గ్రహందొరై, టి.సుబ్బనాథన్, జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. గుంటూరులోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీ రింగ్ అండ్ టెక్నాలజీకళాశాలలో ఆదివారం వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కళాశాల అధికారులు, అధ్యాపకులతో పాటు షార్ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్‌బాబు, కార్యక్రమాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఎస్.శింబుప్రసాద్‌తో పాటు షార్ శాస్త్రవేత్తలు శ్రీనివాసులురెడ్డి, లీలా నాగ శ్రీనివాసరావు, జి.మునిరాజా తదితరులు పాల్గొన్నారు. మొత్తంమీద సెలవు రోజు అయిన ఆదివారం ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో వివిధ చోట్ల అంతరిక్ష పరిశోధనలపై ప్రచారాలు విస్తృతంగా నిర్వహించారు.



ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో పాల్గొన్న పుదుచ్చేరి సిఎం ఎన్.రంగస్వామి

# వంజంగి మేఘాలకొండ ఘాట్‌లో మినీ టూరిస్ట్ బస్సు బోల్తా

## మహిళకు గాయాలు, మిగిలిన పర్యాటకులు సురక్షితం

**పాడేరు, అక్టోబరు 9, ప్రభాతవార్త :** ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి మేఘాల కొండలను తిలకించడానికి పర్యాటకులతో విశాఖపట్నం నుంచి వచ్చిన మినీ టూరిస్ట్ బస్సు వంజంగి మేఘాల కొండఎక్కుతున్న సమయంలో మినీబస్సుకు సంబందించిన బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలోకి బస్సు దూసుకుపోయి బోల్తాపడింది. మేఘాల కొండలను తిలకించడానికి వస్తున్న మినీ టూరిస్ట్ బస్సులో విశాఖపట్నంకు చెందిన డ్రైవర్‌తో పాటు 14 మంది పర్యాటకులు ఉన్నారు. ఒక మహిళ భుజంకు గాయం తప్ప మిగిలిన వారంతా సురక్షితంగా ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. ప్రముఖ పర్యాటక కేంద్రం మేఘాల కొండను తిలకించడానికి ఆదివారం తెల్లవారుజామును 6 గంటల సమయంలో మినీ టూరిస్ట్ బస్సులో విశాఖపట్నం నుంచి పాడేరు మండలం వంజంగి మేఘాల కొండకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నం చేస్తుండగా మినీ బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో అదుపు తప్పిన మినీ బస్సు వంజంగి ఘాట్‌లో ఉన్న లోయలోకి దూసుకుపోయి బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. బస్సు ప్రమాదంలో ఉన్న 14 మంది కూడా విశాఖపట్నంకు చెందిన వ్యక్తులే. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఇందులో విశాఖపట్నం ఆదర్శనగర్‌కు చెందిన బసవబోయిన గౌరి (30) అనే మహిళలకు కాలర్‌బోన్ గాయం కావడంతో పాడేరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించారు. బస్సు ప్రమాదంలో ఒక మహిళకు గాయం తప్ప అందరూ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారని దీనిపై బస్సులో ఉన్న వారందరినీ జిల్లా ఆస్పత్రికి తరలించి ఎవరికీ ఎటువంటి గాయాలు లేకపోవడంతో పర్యాటకులంతా విశాఖపట్నం వెళ్లిపోయారని బస్సు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాడేరు పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు స్థానిక విలేకరులకు తెలియజేశారు. మినీ బస్సు డ్రైవర్ చాకచక్యంగా బస్సును కంట్రోల్ చేస్తూ ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. బస్సు దూసుకువెళ్తున్న సమయంలో బోల్తాపడుతూ లోయలోకి వెళితే ఈ బస్సు ప్రమాదం తీవ్రతరంగా ఉండేదని ఎస్ఐ స్పష్టం చేశారు.



వంజంగి కొండలోయలోకి దూసుకువెళ్లి మినీ బస్సు

# శివయ్య సన్నిధిలో టెక్ మహేంద్ర సిఎండి పూజలు

**శ్రీకాళహస్తి,అక్టోబరు 9 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిధుల తాకిడి పెరుగుతుంది.వచ్చిన అతిధులకు ఓ వైపు శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, మరో వైపు ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుఅతిధి స్వాగతాలు ఏర్పాటు చేస్తున్నారు.వారి చొరవతో సంతృప్తి చెందుతున్న అతిధులు భూరి విరాళాలను అందిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆదివారం టెక్ మహేంద్ర ప్రైవేటు లిమిటెడ్ సిఎండి సిపి గుర్నాని కుటుంబ సభ్యులతో శివయ్యసేవలకు వచ్చారు.వారికి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లు చేసారు.గుర్నాని కుటుంబసభ్యులతో రాగా శాసనసభ్యునితో పాటు ఆయన కుమార్తె పవిత్రారెడ్డి, కుమారుడు ఆకర్షరెడ్డి దక్షిణగోపురం వద్ద ఘనస్వాగతం పలికారు.ఆలయానికి వచ్చిన గుర్నాని కుటుంబసభ్యులు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరారు. వెంటనే వారికి శాసనసభ్యుడు మధుసూధనరెడ్డి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో పూజలు జరిపించారు. కాగా వారికి అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనాల అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయానికి అతిధిగా వచ్చిన గుర్నానిని ఎంఎల్‌ఏ ఘనంగా సత్కరించారు.శ్రీకాళహస్తిలో ప్రసిద్ది చెందిన కలంకారి కళాఖండంతో సత్కరించారు.శ్రీకాళహస్తిలో కలంకారి కళ, కళాకారులకు సంబంధించి వివరించారు.ఎంఎల్‌ఏతో పాటు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,సభ్యులు బుల్లెట్ జయశ్యాం పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఇ ఓ వికె సాగర్‌బాబు, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, టెంపుల్ ఇన్సెపెక్టర్ శ్రీనివాసులు రాజు తదితరులు పర్యవేక్షించారు.





# కృత్రిమ అవయవ మార్పిడి పూర్తి

**నెల్లూరు అక్టోబరు 9, ప్రభాతవార్త-వైద్యం:** శ్రీ పొట్టిశ్రీరాములునెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్‌లో గతంలో దివ్యాంగులు 400మందికి కృత్రిమ అవయవాల మార్పిడికి కొలతలు తీసుకున్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ నెలలో తొలివిడతగా జైపూర్ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందులో 200 మందికి ఉచితంగా కృత్రిమ కాళ్ళు, చేతులు మార్చడంజరిగింది. శనివారం 100మందికి, మిగిలిన 100 మందికి ఆదివారం కాళ్ళు, చేతులు మార్చి అవయవ మార్పిడి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. ఈ సందర్భంగా జైపూర్ సంస్థవారు మాట్లాడుతూ మును ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి చేపడతామని వెల్లడించారు.

# రామాయణం గొప్ప ఇతిహాసం... ప్రతి ఒక్కరికీ ఆదర్శం

## ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావు

**సచివాలయం. అక్టోబర్ 9. ప్రభాతవార్త:** ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో మహర్షి వాల్మీకీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావుతో పాటు సిబ్బంది మహర్షి వాల్మీకీ చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎండి తిరుమలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. వాల్మీకీ రచించిన రామాయణం గొప్ప ఇతిహాసమని, ఇది ప్రతి ఒక్కరికీ ఎంతో ఆదర్శమన్నారు. రామాయణం ప్రస్తుత తరంలోని మనకేకాకుండా రానున్న తరాలకుకూడా స్పూర్తిగా, దిక్సూచిలా నిలుస్తుందన్నారు. వాల్మీకీ మహర్షి గొప్పతనాన్ని కీర్తించుకోవడం, మననం చేసుకోవడం సంతోషదాయకమన్నారు. కుటుంబ విలువలు, వాటి గొప్పతనాన్ని తెలియజేసే విధంగా రామాయణాన్ని రచించిన వాల్మీకీ జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకునే అవకాశాన్ని ప్రభుత్వం మనకి కల్పించినందుకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్) కే.ఎస్.బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రామాయణ గ్రంధం మన దేశంలోనే కాకుండా విదేశాలలో సైతం ప్రాముఖ్యత కలిగి ప్రపంచ దేశాలకూ ఆదర్శంగా నిలిచిందన్నారు. జీవన విధానం ఎలా ఉండాలో నేటి తరాలకు, భవిష్యత్ తరాలకు కూడా రామాయణం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వరరావు, డిప్యూటి సిపిఎం (ఏ) జయశంకర్, విజిలెన్స్ ఏ.డి. శోభా మంజరి, ఆర్టీసీ హౌస్ ఉన్నతాధికారులు, హెచ్ఓడిలు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'జగత్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి'



మిలాదున్నబి ప్రపంచశాంతి కోరుతూ ముస్లీంల భారీ ప్రదర్శన

**ఎ కొండూరు, అక్టోబరు 9, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలంలో ముస్లీం సోదరులు జగత్ ప్రవక్త హజరత్ మొహమ్మద్ ముస్తఫా సల్లాల్లాహు అలైహివసల్లం జన్మదిన వేడుకలు ఈద్‌మిలాదున్నబి సల్లాల్లాహు అలైహివసల్లం పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా, ఘనంగా శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, ఎ కొండూరు, కంభంపాడు గ్రామాల్లోని మస్జీదలలో మత గురువులు, ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి తెల్లవార్లు జాగారం చేశారు. ఆదివారం ఉదయం చీమలపాడు గ్రామంలో ముస్లీం సోదరులు ఈద్ మిలాద్ ప్రదర్శన నిర్వహించి జగత్ ప్రవక్తకు ఘనంగా నివాళులర్పిస్తూ యావత్ ప్రపంచ శాంతిని కోరుతూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదీనామస్జిద్ ఇమామ్ హాజరత్ ఎంఎంకె ఖాద్రీతో పాటు ఎఎంటికె దర్బార్ నకీబుల్ ఔలియా సూఫీ హాజరత్ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాగ్దాది బాబా మహాత్ముల ఆధ్యాత్మిక వారసుడు, రెండో పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ పాల్గొని మాట్లాడుతూ ఇస్లాం అంటేనే శాంతి అని ప్రతి ఒక్కరూ శాంతి, పరమత సహనం, సోదరభావం, ప్రేమతత్వాన్ని అలవర్చుకొని జగత్ ప్రవక్త చూపిన బాటలో నడచుకోవాలని, అప్పుడే జగత్ ప్రవక్తకు నిజమైన నివాళి అర్పించినట్లు అని ఖాజా మొహియుద్దీన్ అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ముస్లీం పెద్దలు ఎండి జాఫర్ సాదిక్, అబ్దుల్ ఖాదర్, ఎస్‌కె సుభాని, ఎస్‌కె జాఫర్, అక్బర్, మగ్బూల్, షేక్ షరీఫ , ఎండి సోను, ఎస్‌కె షాజు, జర్నలిస్టులు ఎండి అబ్దుల్లా, ఎండి అసదుల్లా, ఖాజా మొహిద్దీన్, అక్బర్ తదితరులు పాల్గొ న్నారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. జడ్పీటిసి మెంబర్ భూక్యా గనియానాయక్ ముస్లీం మత పెద్దలకు మిలాదున్నబి శుభాకాం క్షలు తెలుపుకున్నారు.

**నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
జోనల్ కార్యాలయం: 3-6-666, బర్వాలే ఛాంబర్స్, వీధి నెం.10, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నెం.040-29701389, మొబైల్: 8885002445.

**ఇ-టెండర్ ద్వారా హ్యాండిలింగ్ మరియు ట్రాన్స్‌పోర్టేషన్ కాంట్రాక్టర్ల నియామకం**

ప్రీమియర్ CPSU అయిన M/s నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (NFL) వారు రెండు సంవత్సరాల కాలానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల రేక్ పాయింట్ల వద్ద రెగ్యులర్ హ్యాండ్లింగ్ మరియు ట్రాన్స్‌పోర్టేషన్ కాంట్రాక్టర్ల నియామకం చేయగోరుచున్నారు. ప్రతీ రేక్ పాయింట్ యొక్క టెండరు డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్: www.national fertilizers. com మరియు http://etenders.gov.in/eprocure/app నుండి డౌన్‌లోడ్ చేసుకొని చూడవచ్చును.

| రాష్ట్రం | రేక్‌పాయింట్ | దరఖాస్తు చివరి తేదీ |
|---|---|---|
| తెలంగాణ | ఖమ్మం, వరంగల్ | 31.10.2022 |
| ఆంధ్రప్రదేశ్ | పడుగుపాడు, చీరాల | 03.11.2022 |
| ఆంధ్రప్రదేశ్ | ఒంగోలు, చిత్తూరు, విజయనగరం,శ్రీకాకుళంరోడ్ | 08.11.2022 |

కేవలం ఇ-టెండర్లు మాత్రమే ఆమోదించబడతాయి. టెండరుకు ఏదైనా సవరణ/ చేర్పులు పై వెబ్‌సైట్లలో మాత్రమే డిస్‌ప్లే చేయబడును.

జోనల్ మేనేజరు

# మరోసారి ఛలో విజయవాడ రానీయొద్దు

## ప్రభుత్వం చెప్పేదొకటి...చేసేదొకొటి: ఎపిఆర్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 9 ప్రభాతవార్త:** ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దని.. మరోసారి ఛలో విజయవాడ వంటి కార్యక్రమానికి తమను దిగనీయవద్దని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపిఆర్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు-ఏపిజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ఏపిఆర్ఎస్ఏ నెల్లూరుజిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు ఆదివారం నెల్లూరుకు వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించిన ఆర్ధిక, ఆర్థికేతర విషయాలను వరుసగా వివరిస్తూ ఆయా సమస్యల పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం తమతో చెప్పేదొకొటిగా..చేసేదొకటిగా వుందన్న ఆయన ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వశాఖల మధ్య తమ మధ్య అంతరాలు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వేతన సవరణ (పీఆర్‌సీ) విషయంలో ప్రభుత్వం అందుకు సంబంధించి ఏర్పాటుచేసిన మంత్రులు-అధికారుల కమిటీతో ఉద్యోగసంఘ నాయకుల మధ్య జరిగినచర్చలలో ఒప్పుకొని వ్రాత పూర్వకంగా ఇచ్చిన అంశా లను సైతం ప్రభుత్వం నేటికీ అమలుచేయలేదన్నారు. ఆర్థికేతర అంశాలను వెంటనే ప్రకటిస్తామని.. ఆర్ధిక అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని పేర్కొన్న ప్రభుత్వం ఆ దిశగా నేటికీ అడుగులు వేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచిన ప్రభుత్వం గురుకుల పాఠశాలల ఉద్యోగులు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు వయోపరిమితి పెంచలేదన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు ఈ విషయమై తమకు హామీ ఇచ్చి అందుకు విరుద్దంగా జీఓ విడుదల చేసిందన్నారు. సిపిఎస్ రద్దుపై ఉద్యోగ సంఘనాయకులను రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ తీసుకువెళ్లి ఆశ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దు కుదరదని చెబుతుండడం దుర్మార్గంగా వుందన్నారు. ఇక కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో పనిచేసే ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్ఏ ఇస్తామన్న ప్రభుత్వం ఆ విషయాన్నీ పట్టించుకోవడం లేదన్న ఏపిఆర్ఎస్ఏ రాష్ట్రనేత కారుణ్య నియామకాల విషయంలోనూ మాట తప్పు తోందన్నారు. రాజకీయనేతలు, ఐఏఎస్ అధికారులు మరణిస్తే వారి వారసులకు డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఇస్తున్న ప్రభుత్వం ఉద్యోగులు మరణిస్తే వారి వారసులకు గ్రామ-వార్డు సచివాలయాలలో ఉద్యోగాలిస్తామనడం ఎంత వరకు సమంజసమన్నారు.

**జీతాలే సక్రమంగా ఇవ్వడం లేదు..**

ఉద్యోగులకు ప్రస్తుతం జీతాలు తప్ప మరే ఇతరాలు రావడం లేదన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆ జీతాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో అక్టోబర్ నెలకు సంబంధించి ఉద్యోగులకు ఇవ్వాల్సిన జీతాలు-పెన్షనర్లకు ఇవ్వాల్సిన పెన్షన్లు నేటికీ పూర్తిగా ఇవ్వలేదన్నారు. ఇక ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, సరెండర్‌లీవ్ తదితరాలు రావడం లేదని..రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ అందడం లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించి దాదాపు రూ. 15 వేల కోట్లు రావాల్సివుందన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగుందని స్వయానా ముఖ్యమంత్రి శాసనసభలో పేర్కొన్న నేపథ్యంలో ఆయా బకాయిలన్నీ విడుదల చేయాలన్నారు. ఉద్యోగుల సహనాన్ని పరీక్షించవద్దన్న ఆయన మరోసారి ఛలో విజయవాడ వంటి కార్యక్రమానికి ఉద్యోగులు దిగకుండా ప్రభుత్వం చూసుకోవాలన్నారు.
ఉద్యోగులలో ఆగ్రహం పెల్లుబికితే ఉద్యోగ సంఘనాయకులుగా తామేమీ చేయలేమన్న ఆయన ఉద్యోగుల వెనుక తాము నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాగా ఈ సమావేశంలో ఏపిఆర్ఎస్ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లాశాఖ అధ్యక్ష కార్యదర్శులైన అల్లంపాటి పెంచలరెడ్డి, మురళి, సతీష్, అనిల్, శేషయ్య, డేనియల్, లక్ష్మి, ప్రదీప్, బాలకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి
కాకినాడ. కోనసీమ.
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# కనకదుర్గ ఆలయంలో చండీ హోమం



శంఖవరం అక్టోబర్ 9 ప్రభాతవార్త : కత్తిపూడి విజయకనకదుర్గ ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పలువురు దంపతులచే చండీ హోమం ఘనంగా నిర్వహించారు గ్రామంలో బ్రిడ్జి వద్ద గల విజయ కనకదుర్గ ఆలయంలో పవిత్ర పౌర్ణమి పురస్కరించుకుని చండీ హోమం నిర్వహించారు. ఆలయ పురోహితులు ఆలయ నిర్వహకులు ఆధ్వర్యంలో వేదపండితులు పూజా కార్యక్రమం నిర్వహించారు పూజలో భాగంగా విగ్నేశ్వర పూజ కలశ ప్రతిష్ట మండపారాధన నవగ్రహ నవదుర్గ ఆ వాహనం అష్టోత్తర పూజ హోమం పూర్ణాహుతి మంత్ర పుష్ప నీరాజనం ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆలయ కమిటీ నిర్వాహకులు గౌతు అర్జీ బాబు మాట్లాడుతూ ప్రతి నెల పౌర్ణమి రోజు అమ్మవారి ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తామని భక్తులు పాల్గొని అమ్మవారి దర్శించుకోవాలని గత ఏడాది కార్తీకమాసంలో పౌర్ణమి రోజు పూజా కార్యక్రమం ప్రారంభించామని 121 మంది దంపతులు ప్రతి పౌర్ణమికి పలువురు దంపతులచే పూజా కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. భక్తుల సహకారంతో ప్రతి శుక్రవారం అమ్మవారి ఆలయంలో భారీ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. పౌర్ణమి ఆదివారం కలిసి రావడంతో అధిక సంఖ్యలో భక్తులు పాలుగోని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జీ జీ హెచ్ లో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

కాకినాడ సిటీ, అక్టోబర్ 9,( ప్రభాతవార్త) : రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీ గా ఉన్న కృష్ణా జిల్లా కు చెందిన పళని హరీష్ కుమార్ (38) కాకినాడ జిజిహెచ్ నందు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కాకినాడ ఒకటవ పట్టణ పోలీసులు తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన హరీష్ కుమార్ హత్యా నేరంతో ఈ సంవత్సరం జూన్ నెల వరకు కృష్ణ జిల్లా సబ్ జైలులో ఖైదీగా ఉండేవాడు, తరువాత రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఇతను గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించిన సెంట్రల్ జైలు సిబ్బంది రాజమండ్రి ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స చేయించ్చారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడ వైద్యుల సూచన మేరకు ఈ నెల 7 తేదిన కాకినాడ జిజిహెచ్ కు తీసుకువచ్చారు. జిజిహెచ్ నందు చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు జిజిహెచ్ వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మృతిపై స్థానిక ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు.

# అమ్మవారి భారీ ఊరేగింపు కిక్కిరిసిన ప్రధాన రహదారి



గోకవరం, అక్టోబర్ 9. ప్రభాత.వార్త : వేల సంఖ్యలో భక్తులు.. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులు.. మందుగుండు సామాగ్రితో దద్దరిల్లిన గ్రామం.. కిక్కిరిసిన ప్రధాన రహదారి.. విశేష సంఖ్యలో పోలీస్ బందోబస్తు నడుమ అంగరంగ వైభవంగా అమ్మవారి ఊరేగింపు జరిగింది.. రెండు కళ్ళు చాలవన్న రీతిలో రథయాత్ర సాగింది... దసరా ఉత్సవాలలో భాగంగా చివరిగా ఆదివారం గోకవరంలో దేవిచౌక్ అమ్మవారి ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.. లెక్కకు మించి విచిత్ర వేషాలు ఉన్నాయి...మరో పక్క ఆర్కెస్ట్రా, సాంప్రదాయ నృత్యాలు, యువత డాన్సులు, ఇలా ఎన్నో రకాలతో బ్రహ్మాండంగా సాగింది.. అడుగుడుగున ఆలయ ప్రోత్సాహక సభ్యులు జాగ్రత్తలు తీసుకున్నారు.. గోకవరం, కోరుకొండ, సీతానగరం స్టేషన్లు నుండి పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.. గోకవరం దేవిచౌక్ లోని అమ్మవారి ఊరేగింపుకు ఈ ఒక్కరోజు సుమారు 15 లక్షల రూపాయలు ఖర్చు అయినట్లు చెపుతున్నారు.. అంతే స్థాయిలో ఊరేగింపు, రథయాత్ర, వివిధ రకాల ప్రోగ్రామ్ లు ఉన్నాయి.. అత్యంత పేరుగాంచిన గోకవరం ఊరేగింపులో వివిధ గ్రామాల నుండి భక్తులు వచ్చి పాల్గొన్నారు.

# ముగిసిన దసరా శిక్షణా తరగతులు



ఆత్రేయపురం, అక్టోబర్ 9( ప్రభాతవార్త ): డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి కి చెందిన శ్యామ్ జాదుగర్ మాయా ఈ బడి ఆధ్వర్యంలో నూతన విద్యా విధానాన్ని అనుసరించి నిర్వహించి వివిధ కళా రూపాలలో చిన్నారులకు ఇచ్చిన ఉచిత శిక్షణా తరగతులు ముగింపు సందర్భంగా చిన్నారులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు కర్ర సాము, అక్షర చిత్ర కళ, మ్యాజిక్, తీన్ మార్, కీ బోర్డు, బొమ్మలాట,ఓరిగామి వంటి కళలలో శ్యామ్ మాష్టారు, గెడ్డం వెంకట రావు మాష్టారు విద్యార్థులకు తర్ఫీదు ను ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శ్యామ్ మాష్టారు మాట్లాడుతూ చిన్నారులలో ఆత్మరక్షణ,సృజనాత్మకత,ఏకాగ్రత వంటివి పెంచడానికి ఇటువంటి శిక్షణ తరగతులు ఉపయోగ పడతాయి అని వీరి ఆశక్తిని చూసి భవిష్యత్తు లో మరిన్ని నూతన కళ లలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# ప్రాజెక్ట్ వర్క్ స్టేట్ ఆఫ్ మై డ్రీమ్. యస్ ఐ ....



సఖినేటిపల్లి అక్టోబరు 9 ప్రభాత వార్త : విద్యార్థుల్లో అలోచనా శక్తి , సృజనాత్మకత పెంపొందించటానికి ప్రాజెక్ట్ వర్కుల దోహదపడతాయనీ సఖినేటపల్లి మండల సబ్ ఇన్స్పెక్టర్ ఏ. ఫణి మోహన్ అన్నారు. సఖినేటిపల్లి గ్రామానికి చెందిన తాడి హెలెనా రాజమండ్రి శ్రీ చైతన్య స్కూల్ సివిల్స్ బ్యాచ్ లో 8వ తరగతి చదువు తున్నారు. దసరా సెలవుల్లో ఆ పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ప్రాజెక్ట్ వర్క్ స్టేట్ ఆఫ్ మై డ్రీమ్ ను సఖినేటిపల్లి మండల సబ్ ఇన్స్పెక్టర్ ఏ ఫణి మోహన్ ఆదివారం పరిశీలించారు . రాష్ట్ర ప్రగతికి విద్యార్థి చేసిన ప్రాజెక్ట్ వర్క్ స్ఫూర్తిదాయకంగా ఉందని ఆయన అభినందించారు. మంచి ప్రయోజనకారి అవ్వాలని ఆశీర్వదంచారు.

# అన్నదమ్ములు వాత్సల్యం, ప్రేమ, పిత్ర వాక్కు పరిపాలకునిగా శ్రీరాముని చరిత్ర ప్రపంచ దేశాలకు ఆదర్శం..



రాజమహేంద్రవరం అక్టోబర్ 9 ప్రభాతవార్త బ్యూరో : రామాయణాన్ని మహాకావ్యంగా మలిచి , భారత దేశ కుటుంబ వ్యవస్థ విధానాన్ని రామాయణ మహా గ్రంథం గా ఆవిష్కరణ చేసిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని జిల్లా రెవిన్యూ అధికారి జి. నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జన్మదిన వేడుకలకు డీఆర్వో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి జీ. నరసింహులు మాట్లాడుతూ, మహర్షి వాల్మీకి రచించిన రామాయణం కావ్యం యొక్క విశిష్టతను భారత దేశం తో పాటు ప్రపంచ దేశాలు ఆదర్శంగా భావిస్తున్నాయన్నారు. నేడు వాల్మీకి జయంతి వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా వేడుకలు నిర్వహించాలని ఆదేశాలు చెయ్యడం జరిగిందన్నారు. భవిష్యత్తు తరాలకు వారు చూపించిన ఆదర్శాలను తెలియచేసే ఉద్దేశ్యంతో ఆ మహనీయుని జయంతి వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ వేడుకగా వారిని స్మరించుకోవడం జరుగుతోందన్నారు. రామాయణ దివ్యా గ్రంథాన్ని రచించిన ఆది కవి వాల్మీకిని స్మరించుకుని, ఆ దివ్య పురుషునికి నీరాజనాలు పలకడం మన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. "ఒకే మాట ... ఒకే బాణం.. ఒకే పత్ని" .. అనే రాముడి భావజాలాలను చాలా సులువుగా ప్రజలకు అర్థమయ్యేలా తన రచనలతో చేరవేసిన రామాయణం గొప్ప శక్తి అని, అందుకే ఒక బోయవాడు కాస్త మహర్షిగా కీర్తించబడు తున్నారన్నారు. రామా అని పలకడం కూడా రాని వ్యక్తి సత్యం, ధర్మ నిష్ఠ మనకు నేర్పి మహర్షి అయ్యాడన్నారు. అన్నదమ్ములు వాత్సల్యం, ప్రేమ, పిత్ర వాక్కు పరిపాలకునిగా శ్రీరాముని చరిత్ర భారత దేశానికే కాదు నేడు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వాల్మీకి మహర్షి జన్మ దినాన్ని పురస్కరించుకుని కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంఛార్జి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పి. రామకృష్ణ, కలెక్టరేట్ ఏవో జి. భీమారావు, పలువురు జిల్లా అధికారులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు జి రఘురాం పి. శ్రీను , పి. సరోజ ఏ. సుకుమార్, ఎన్.సురేష్, కలెక్టరేట్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అడ్డాల కృష్ణునీ కాపాడిన సీ.ఐ రమణ



అనపర్తి అక్టోబర్ 9 ప్రభాతవార్త : అనపర్తి సర్కిల్ సి.ఐ శ్రీ జె. వి. రమణ పోలీసు వాహనంలో సర్కిల్ ఆఫీస్ కి ఉదయం 9 గంటల సమయంలో వెళుతూ ఉండగా మార్గమధ్యలో సాయిబాబా గుడి వద్ద ఒక వృద్ధుడు రోడ్డు పక్కన పడి ఉండి తలకు గాయం అయ్యి రక్తం కారుతూ ఉండగా స్థానికులు ఎవరు భయపడి దగ్గరికి రాకపోవడంతో, అంతట సి.ఐ మానవ దృక్పథంతో అతనిని పోలీసు వాహనంలో ఎక్కించుకొని అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రి తీసుకువెళ్లి జాయిన్ చేసి ఆసుపత్రి సిబ్బంది తో దగ్గరుండి ఆ వృద్ధుడికి తగిన వైద్య మరియు ఆర్థిక సహాయం చేయడమైనది. అతని పేరు అడ్డాల కృష్ణ, వయసు 60 సంవత్సరాలు, పార్వతీపురం, విజయనగరం జిల్లా అని సుమారుగా 30 సంవత్సరాల నుండి అనపర్తి పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నాడని, అతనికి ఎవరూ లేరని, నిన్న రాత్రి సాయిబాబా గుడి మెట్లుపై పడుకోవడం వల్ల నిద్రలో మెట్లుపై నుండి జారి రోడ్డు ప్రక్కన రాయి పై పడిపోవడం వల్ల అతని తలకు బలంగా గాయం అయిందని, తెలియపరిచినాడు. అనపర్తి సి.ఐ తక్షణమే స్పందించి చూపించిన మానవత దృక్పథానికి, పోలీసులు ప్రజలకు చేసే సేవలు పట్ల ప్రత్యక్షంగా నమ్మకం, గౌరవం కలిగాయని, గతంలో కూడా అనపర్తి సి.ఐ రమణ పలుమార్లు ఆపద సమయాల్లో తక్షణమే స్పందించి వారి యొక్క మానవ దృక్పథాన్ని చాటుకుని పలు ప్రత్యక్ష సేవలు అందించడమైనది ఇటువంటి సేవా దృక్పథం కలిగిన సిఐ మా అనపర్తి సర్కిల్లో ఒక మంచి అధికారిగా ఉండడం వల్ల చాలా సంతోషంగా ఉన్నదని, మొత్తంగా ఇటువంటి పోలీస్ అధికారులు మానవత దృక్పథ సేవలు వల్ల ప్రజలలో పోలీసు వ్యవస్థ పై పూర్తి నమ్మకం ఏర్పడుతుందని స్థానిక ప్రజలు అభినందించడమైనది

# ప్రాజెక్టువర్కులు విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీస్తాయి... ఎమ్మెల్యే చిట్టిబాబు



మామిడికుదురు.అక్టోబర్09 ప్రభాతవార్త : జిల్లాకు సంబంధించిన సమగ్ర సమాచారంతో విద్యార్థులు తయారు చేసే ప్రాజెక్టు వర్క్ లు విద్యార్థుల్లో నిగూఢంగా ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. రాజమండ్రి శ్రీ చైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సివిల్స్ బ్యాచ్ విద్యార్థి పసుపులేటి గుణ సాత్విక్ రూపొందించిన ప్రాజెక్టు వర్క్ ను ఆదివారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాజెక్టు వర్క్ విద్యార్థుల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల్లో చైతన్యం తీసుకువస్తుందన్నారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలను ఆయన అభినందించారు.

# ప్రకృతి సాగులో ఏడాది పూర్తి పంటలు సాగుపై నియోజక వర్గ స్థాయి శిక్షణ

రాజవొమ్మంగి, అక్టోబరు 9, ప్రభాతవార్త : రాజవొమ్మంగి మండల వెలుగు కార్యాలయంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ పద్దతిలో ఏడాది అంతా వ్యవసాయం చేసే పద్ధతులుపై రంపచోడవరం నియోజక వర్గ స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. రంపచోడవరం, చింతూరు పరిధిలోని 11 మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హాజరైనారు.. ఈ కార్యక్రమానికి హాజరైన అల్లూరిజిల్లా ప్రకృతి వ్యవసాయ డి.పీఎం.బి.మోహనరావు మాట్లాడుతూ వరి వేసిన భూమిలో 365 రోజులు పంటలు ఉండే విధముగా విత్తనాలు వేసే విధానం పైన శిక్షణలో వివరించారు. రభి డ్రై షోయింగ్ ప్లాన్ ను యూనిట్ వారీగా చేయించడం జరిగింది. బంకమట్టి, ఘనజీవామృతం ఉపయోగించి విత్తన బంతులు తయారీపై శిక్షణ ఇవ్వడం జరిగింది. దాని ద్వారా 365 రోజులు విత్తనాలు మొలకెత్తుటకు అవకాశం ఉంటుందన్నారు. వరి పంట తీసిన వెంటనే భూమిని కాలీగా ఉంచకుండా దుక్కి లేకుండా 10 నుండి 18 రకాల పంటలుతో రభీ డ్రై సోయింగ్ వేసే విధముగా రైతులకు అవగాహన కల్పించి వేయించాలని చెప్పారు. ఆరోగ్య కరమైన ఆహారం, వాతావరణ కాలుష్యం, జల కాలుష్యం కాకుండా ప్రకృతి సేద్యం వలనే సాధ్యం అవుతుందని తెలియజేశారు. ఎన్నో సత్ఫలితాలు ఇస్తున్నా, ప్రకృతి వ్యవసాయన్ని ఇంటి ఇంటికీ చెరువా అయ్యేలా చూడాలన్నారు. ప్రత్తి రైతు కూడా ప్రకృతి సేద్యం చేసేలా అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ని డి.పి.ఎం.సూచించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఎం బి.మోహనరావు, జిల్లా కో ఆర్డినేటర్ బి.కుమార్, 11 మండలాల ఇంచార్జ్ బి.శ్రీను, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు..



## వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ సేవలు అభినందనీయం

### - ఘనంగా మెగా డైరెక్టర్ వివి వినాయక్ పుట్టినరోజు వేడుకలు
### - పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ

రావులపాలెం, అక్టోబరు 09, ( ప్రభాతవార్త) : మెగా డైరెక్టర్ వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ చేస్తున్న సేవలు అభినందనీయం అని పలువురు కొనియాడారు. రావులపాలెం మండలం ఈతకోటలో ప్రముఖ సినీ దర్శకుడు వివి వినాయక్ పుట్టినరోజు వేడుకలను స్థానిక వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు గంధ్రోతు వీర గోవిందరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి, ప్రముఖ వ్యాపారవేత్త రాచకొండ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసారు. సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన బియ్యం,దుప్పట్లు, పండ్లు సుమారు 60 మంది పేదలకు పంపిణీ చేసారు. అలాగే చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లు, పెన్నులు అందజేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బలక్ష్మి, రాచకొండ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించిన వివి వినాయక్ తెలుగు సినీ రంగంలో తన ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. ఠాగూర్ వంటి సమాజ హితమైన చిత్రాలతో ఆయన తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను ఆయన రూపొందించాలని ఆకాంక్షించారు. ఆయన పేరుతో సంస్థను స్థాపించి ఇరవై ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్న గంధ్రోతు వీర గోవిందరావు, గంధ్రోతు దుర్గా సురేష్, గంధ్రోతు దుర్గాదేవిలను అభినందించారు. వీర గోవిందరావు, దుర్గా సురేష్, దుర్గాదేవి మాట్లాడుతూ 2002లో వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ స్థాపించామన్నారు. అందరి సహాయ సహకారాలతో గత రెండు దశాబ్దాలుగా పేదలకు సేవా కార్యక్రమాలు



చేస్తున్నామని తెలిపారు. వివి వినాయక్ అంటే ఎంతో అభిమానం అని, భవిష్యత్తులో ఆయన ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించాలని ఆకాంక్షించారు. సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. ఉదయం స్థానిక రామాలయంలో వివి వినాయక్ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అన్వర్, రాచకొండ సతీష్, వైసీపీ నాయకులు యర్రంశెట్టి కాళీకృష్ణ, టీడీపీ నాయకులు యర్రంశెట్టి నాగేశ్వరరావు (బుజ్జి), జనసేన నాయకులు బొరుసు సుబ్రహ్మణ్యం, గుబ్బల రామ్మోహనరావు, గంధ్రోతు సతీష్, గంధ్రోతు గౌతమ్, గంధ్రోతు సత్యనారాయణ, గంధ్రోతు సూర్య భాస్కరరావు, గంధ్రోతు వీరన్న, మోటూరి శ్రీను, మోటూరి రమేష్, దైవాల రాంబాబు, మోటూరి వెంకన్న, ఏపుగంటి నాగు, దామోదర హరీష్, యర్రంశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

రాజవొమ్మంగి, అక్టోబరు 9, ప్రభాతవార్త : ఆదివారం రాజవొమ్మంగి మండలంలో ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు జరిగాయి. కింద్ర గ్రామంలో వాల్మీకి నాయకులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎం.పి.పి గోము వెంకటలక్ష్మి, కింద్ర పంచాయితీ సర్పంచ్ బూసరి సత్యనారాయణ పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలను వేశారు. వాల్మీకి మహర్షి చరిత్ర ను ఎం.పి.పి వివరించారు. ఒక ఆటవిక జీవనం గడుపుతూ బోయవాడు వాల్మీకి రామాయణ రచన చేసి మహర్షి గా చరిత్రలో నిలిచాడని సర్పంచ్ సత్యనారాయణ అన్నారు. అటువంటి మహనీయుడు వ్రాసిన రామాయణం ప్రతీ ఒక్కరూ చదివే పవిత్రగ్రంథం అని అన్నారు. ఈకార్యక్రమంలో ఎం.పి.పి గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ బూసరి సత్యనారాయణ, వాల్మీకి యూత్ నాయకుడు బండి చిట్టిబాబు, వార్డ్ మెంబర్ బండి పార్వతీ, అదిరెడ్డి సత్తిబాబు, అదిరెడ్డి సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు. వాతంగి గ్రామంలో జిల్లా వాల్మీకి సంఘం కార్యదర్శి రాళ్ళగడ్డ అర్జున్, మాజీ సర్పంచ్ జుర్రా జాన్ బాబు అధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ బిమిరెడ్డి సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ జుర్రా రాజేశ్వరిలు హాజరైనారు, గ్రామ పెద్దలు రెడ్డి రమణ, కంచెం నాగరాజు, జుర్రా .లక్ష్మయ్య, వాల్మీకి మహర్షి



విగ్రహానికి పూలమాలలు వేశారు. వాల్మీకి మహర్షి చరిత్రను మఠం.సువర్ణ కుమార్ వివరించారు. కార్యక్రమంలో రెడ్డి.రమణ, కంచెం నాగరాజు, రెడ్డి చంద్రరావు, కలింకోట చిన్నబ్బాయి, జుర్రా. యేసురత్నం, చింతల. శ్యాంబాబు, , జమితి. శాంతారావు, మఠం. సువర్ణ కుమార్, మద్దికొండ.నూకరాజు, లోసుల చంటి బాబు పాల్గొన్నారు. వంచంగి గ్రామంలో సర్పంచ్ కె.కాంతం అధ్యక్షతన వాల్మీకి జయంతి జరిగింది. వాల్మీకి చరిత్రను వంచంగి పంచాయతీ వైస్సార్సీపీ పంచాయతీ ఇంచార్జ్ కుంద్రు అర్జున్ వివరించారు. ఈకార్యక్రమంలో పాతగోలుసుల రమేష్ బాబు, గ్రామస్తులంతా పాల్గొన్నారు.

## శ్రీహరిని ఆదర్శంగా తీసుకోవాలి..

అంబాజీపేట, అక్టోబర్ 09, ప్రభాతవార్త : సినీ హీరో, రియల్ స్టార్ రఘుముద్ర శ్రీ హరిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కొర్లపాటివారిపాలెం కాపు యువత అన్నారు. శ్రీహరి 9వ వర్ధంతిని అంబాజీపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూలు ఎదురుగా ఉన్న శ్రీ హరి విగ్రహానికి శ్రీహరి అభిమానులు, కాపు యువత పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీహరి సమాజ సేవ చేసి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. నేటి యువత శ్రీహరిని ఆదర్శంగా తీసుకుని సమాజ సేవను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూదాబత్తుల రాము, కొర్లపాటి ఆదిబాబు, రవణం వెంకట్రావు, పళ్ళ రాజు, శిరగం బుజ్జి, కొర్లపాటి శేషారావు,గోదశి బాబి తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిమన్ మసీదుకు రూ.50 లక్షలు విరాళం..

అంబాజీపేట, అక్టోబర్ 09, ప్రభాతవార్త : ముస్లిం మత గురువు నివాసం ఉండేందుకు రూ.25 లక్షల విలువైన స్థలంతో పాటు, రూ. 25 లక్షల ఖర్చుతో భవనాన్ని నిర్మించి అంజుమాన్ ఇందాదుల్ ముస్లిమన్ మసీదు కమిటీకి నలుగురు ముస్లిం సోదరులు ఆదివారం విరాళంగా ఇచ్చారు. అంబాజీపేటలో జనాబ్ మహమ్మద్ మీర్ అయూబ్ అలీ (అలీ)కి చెందిన రూ. 25 లక్షలు విలువైన మూడు సెంట్ల స్థలంలో అతని సోదరులు జనాబ్ మహమ్మద్ మీర్ ఉస్మాన్ అలీ(రఫీ), జనాబ్ మహమ్మద్ సూరజ్ అలీ, జనాబ్ మహమ్మద్ మీర్ ముస్తాక్ అలీల ఆధ్వర్యంలో రూ.25 లక్షలతో భవనాన్ని(గ్రౌండ్ ఫ్లోర్) నిర్మించారు. ఈ భవనాన్ని వారి తల్లితండ్రులు మర్ హుమ్ హాజీ జనాబ్ మహమ్మద్ గౌస్ మొహిద్దీన్, షాన్వాజ్ బేగంల జ్ఞాపకార్థం



మసీదు కమిటీకి నలుగురు సోదరులు విరాళంగా ఇచ్చారు. ఈ భవనంలో మత గురువు నివాసముంటారని కమిటీ సభ్యులు తెలిపారు.

## రూ 5.96 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కన్నబాబు ..

కాకినాడ రూరల్, అక్టోబర్ 9,(ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట, సర్పవరం గ్రామాలలో రు 5.96 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే కన్నబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను వైసిపి నాయకులు పుల్ల చందు యూత్ సభ్యులు గజమాలతో ఘనంగా సత్కరించారు. సర్పవరం గ్రామ సర్పంచ్ శీలం చిన్నా, వైసిపి నాయకులు పుల్లా చందు ఆధ్వర్యంలో జలజీవన్ నిధులతో తలపెట్టిన ఇంటి ఇంటికి కుళాయి కనెక్షన్లు కార్యక్రమాన్ని శంకుస్థాపన చేసారు. అనంతరం స్థానిక తొమ్మిదవ వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని, ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై వివరాలు తెలుసుకున్నారు. రూరల్ నియోజకవర్గంలో దాదాపు ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని, రూ 40 కోట్ల రూపాయల వ్యయంతో పనులు



ప్రారంభించామనీ దానిలో బాగంగా సర్పవరం గ్రామంలో ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు మంజూరు కొరకు, పైప్ లైన్లు, ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యంపిపి గోపిశెట్టి పద్మజా బాబ్జీ, ఉప సర్పంచ్ పుల్లా ప్రభాకరరావు, పుల్లా కోటేష్, పుల్ల చక్రధర్, నూక రత్నంస్వాములు, ఎంపీటీసీలు గుత్తుల శ్రీనివాసరావు, సారా రాజేష్, పుల్ల ధర్మరాజు, ఇంచార్జ్ ఎండిఓ జె శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆర్ వి వి సత్యనారాయణ, జె ఇ మారుతీ రావు, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది ,వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జక్కంపూడి11వ.వర్ధంతి

మామిడికుదురు. అక్టోబర్09 ప్రభాతవార్త : మాజీమంత్రి స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు 11వ. వర్ధంతిని మామిడికుదురు సెంటర్లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యేగా,మంత్రిగా జక్కంపూడి ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో నాయకులు కొమ్ముల రాము, నెల్లి దుర్గాప్రసాద్, గౌస్ మొహిద్దీన్,జక్కంపూడి వాసు, తులా గోపాలకృష్ణ,వర్ధినేని రాము, నైనాల శివ,డా.వెంకటేశ్వరరావు, జగతా అరుణాచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా బేతాళ ఉత్సవాన్ని నిర్వహించుకోవాలి..
## సీ.ఐ. ప్రశాంత్ కుమార్..



అంబాజీపేట, అక్టోబర్ 09, ప్రభాతవార్త : అంబాజీపేటలో ఈనెల 11న నిర్వహించే శ్రీ విజయ బేతాళ స్వామి వాహన మహోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పి. గన్నవరం సీఐ డి. ప్రశాంత్ కుమార్ సూచించారు. అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్లో 13 పాలెంలకు వాహన మహోత్సవ నిర్వాహకులతో ఎస్సై ఎ.చైతన్యకుమార్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 13 వాహనాలకు సంబంధించి ఎక్కడ ఎటువంటి సినీ హీరోలు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దన్నారు.అలాగే వాహనాల ఊరేగింపులో అశ్లీల నృత్యాలు, అభ్యంతరకర కార్యక్రమాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. పోలీస్ సిబ్బందికి ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. ప్రతీ వాహన వద్ద సినీ ఆర్కెస్ట్రాల వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తాన్నారు. వాహనాల వద్ద ఎటువంటిలు ఘర్షణలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీలదేనన్నారు. ప్రతీ ఏటా నిర్వహిస్తున్న వాహనాల ఊరేగింపు ఆనవాయితీ ప్రకారం నిర్వహించుకుని ప్రశాంతంగా తీసుకెళ్లేందుకు వాహనాల నిర్వాహకులు, ప్రజలు సహకరించాలన్నారు. అలాగే ఈ సందర్భంగా నిర్వహించే తీర్థంనకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో మహిళలు వస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా ఉత్సవ కమిటీలే బాధ్యత తీసుకోవాలన్నారు. శ్రీ విజయ బేతాళ స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు కలిగించేలా ఉత్సవ కమిటీయే బాధ్యత తీసుకోవాలని సీఐ ప్రశాంత్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అంబాజీపేట, మాచవరం శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి రామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం మోహనరావు, గుత్తుల పండు, మట్టపర్తి పరమేశ్వరరావు, 13 పాలెంల సంఘ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాలతో మొహమ్మద్ ప్రవక్త జయంతి

మామిడికుదురు. అక్టోబర్09 ప్రభాతవార్త. ఇస్లాం మత వ్యవస్థాపకులు మొహమ్మద్ ప్రవక్త జయంతిని మామిడికుదురు మండలం లోని ముస్లింలు ఆదివారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా స్థానిక ఇన్నా ఫతహనా సున్నీ జామియా మసీదులో ఖురాన్ పఠనం, అనంతరం మీలాద్ జరిగింది. ఈమీలాద్ లో స్థానిక యువకులతో పాటు పలువురు కవులు తమ ఖసీదాలను ఆలపించారు. మత గురువు సాదిక్ అన్వర్ రజ్వి మొహమ్మద్ ప్రవక్త జయంతి విషయాలను భక్తులకు వివరించారు. మీలాద్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు కమిటీ ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మసీదును విద్యుత్ దీపాలతో బెలూన్లతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈకార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మసూద్



మొహిద్దీన్, స్థానిక సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మహమ్మద్ మొహిద్దీన్ కిష్వర్, కరీముల్లా, చమ్మీజాన్, సయ్యద్ రూహి బాఖరి,మీర్ హసన్ మషద్ది,అన్వర్ నవాబ్ జాని, ఆబేద్అలి,ఎండివై షరీఫ్, నౌషాద్ అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

## ఘనంగా జక్కంపూడి 11వర్ధంతివేడుకలు

కోరుకొండ అక్టోబర్ 9 (ప్రభాతవార్త) దివంగతనేత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు 11వవర్ధంతి కార్యక్రమాలను కోరుకొండ మండలంలో వైయస్సార్సీపినాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుతగా మండల వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు అధ్వర్యంలో కోరుకొండ బస్ స్టాండ్ లోను, కోటి గ్రామంలో సర్పంచ్ వెంటపాటి దుర్గారావు ఆధ్వర్యంలో ను, గాదరాడ, నిడిగట్ల, పశ్చిమగోనగూడెం, నరసాపురం, రాఘవాపురం, మధురపూడి, కాపవరం, శ్రీరంగపట్నం, పలు గ్రామాలలో వైఎస్ఆర్సిపి సర్పంచులు,ఎంపిటిసి సభ్యులు, నాయకులు ఆధ్వర్యంలో దివంగత నేత జక్కంపూడి రామ్మోహన్ రావువిగ్రహాలకు,చిత్రపటాలకు, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ జక్కంపూడి ఒక సామాన్య కుటుంబంలో జన్మించి పేద ప్రజల పక్షాన నిలబడి కష్టాలను అనుభవిస్తూ ధైర్యాన్ని



కూడపెట్టుకుని, రాష్ట్రంలో ఆటుపోట్లను తట్టుకుంటూ అప్పటి టిడిపి ప్రభుత్వ హవా కొనసాగుతున్న రోజుల్లో రాష్ట్రంలో ఏకైక ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి స్థానాన్ని సంపాదించుకున్న ఏకైక వ్యక్తి జక్కంపూడి రామ్మోహన్ రావుఅని, దివంగత నేతకు జోహార్లు తెలుపుతూ పలువురు నాయకులు ప్రసంగించారు.

## వరద ను తలపించే ఆటు పోటు లు తీవ్రత



సఖినేటిపల్లి అక్టోబరు 9 ప్రభాత వార్త: సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లవపాల్లం లో వరధ ను తలపించే విధంగా పోటు నీరు. గోదావరి నీరు ఎక్కువగా ఉండటంవలన లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సముద్రములో అల్పపీడనం ఏర్పడినందున నీరు బిగించింది, దాని వలన గ్రామాలలో కొన్ని ఇండ్లు లోకి నీరు ప్రవహిచసాగింది. దీనిని తెలుగు దేశం పార్టీ నాయకులు, ఇండ్లును పరిశీలించారు. ఈకార్యక్రమంలో తే దే పా రాష్ట్రఅగ్ని కుల క్షత్రియ సాధీ కారిక కమిటీ సభ్యులు తిరుమాని ఆచార్యులు, తాడి మోహన్బాబు, కొల్లు శామోరు తెలిపిరి.

## శ్రీశ్రీశ్రీ వనవులమ్మ కనకదుర్గమ్మ అమ్మవార్ల ఊరేగింపు



పెనుమంట్ర, అక్టోబర్-09, ప్రభాతవార్త: మండలంలోని నెగ్గిపూడిలో వేంచేసియున్న శ్రీ వనవులమ్మ మరియు శ్రీ కనకదుర్గమ్మ అమ్మవార్ల దసరా మహోత్సవాలు సందర్భంగా గ్రామంలో మేళతాళాల మధ్య భారీగా ఊరేగింపు జరిగింది. అమ్మ వార్లను చక్కగా అలంకరించి ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో మహిళలు పసుపు, ఎరుపు రంగు చీరలు ధరించి బిందెలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అల్లం భాస్కర రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏర్పాటు ఘనంగా జరిగ్గియి.

## విద్యార్థులకు ఉన్నత విలువలు నేర్పించండి




ప్రభాతవార్త-ఏలూరు : వసతి గృహల్లోని విద్యార్థినీ , విద్యార్థులకు చదువుతో పాటు ఉన్నత విలువలు నేర్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కె.హర్షవర్ధన్ సంబంధిత సిబ్బందికి సూచించారు. ఆదివారం ఏలూరులోని పలు వసతి గృహములను అకస్మిక పరిశీలన చేశారు. విద్యారంగ సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ పాలల్లో " మనబడి నాడు- నేడు " కార్యక్రమము ద్వారా వాటి రూపురేఖలు ఎలా మార్చినదో , అలాగే త్వరలో మొదటి విడత " సంక్షేమ వసతి గృహముల నాడు నేడు " కార్యక్రమమును ప్రవేశ పెట్ట తలచినదని తెలియజేసారు . ఇందులో భాగంగా , ఏలూరు నందు గల వసతి గృహములను పరిశీలించి , తదుపరి స్థానిక సి.ఆర్.ఆర్ . ఫార్మసీ కళాశాల నందు జిల్లాలోగల సహాయ సాంఘిక సంక్షేమాధికారులు , వసతి గృహ సంక్షేమాధికారులు , ఇంజనీరింగ్ అధికారులు మరియు సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బందితో కలిపి శాఖా పరమైన సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహముల నాడు-నేడు " కార్యక్రమము ద్వారా మౌలిక వసతుల మెరుగుపడి , పిల్లల అభ్యున్నతికి దోహద పడతాయని పేర్కొన్నారు . ఈ కార్యక్రమాన్ని అర్ధవంతంగా ముందుకు తీసుకు పోవుటకు తగు సూచనలు మరియు సలహాలు ఇవ్వడం జరిగినది . వసతి గృహములలోని విద్యార్థినీ , విద్యార్థులకు చదువుతో పాటు ఉన్నత విలువలు నేర్పించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు , యస్ . మధుసూదనరావు నిర్వహించియున్నారు .

## దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ పంపిణి



లింగపాలెం, అక్టోబర్-09, ప్రభాతవార్త: మానవసేవయే మాధవ సేవ అంటూ అమ్మ మాట అమ్మాయి బాట ట్రస్ట్ భాద్యులు బొప్పన రాధమ్మ సౌజన్యం తో మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన పాగి వెంకన్న అనే దివ్యాంగుడికి మండల టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు యర్రమాల సత్యనారాయణ సూచన మేరకు ఐ టి డి పి చింతలపూడి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోడా.అనీష్ కుమార్ ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిల్ని అందించడం జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన చింతలపూడి మండలం మాజీ జడ్పిటిసి, మాజీ మండల పరిషత్ అధ్యక్షులు తాళ్లూరి రాధా రాణి మాట్లాడుతూ మనకు ఉన్న దానిలో ఆపదలో ఉన్నవారికి ఎంతో కొంత సాయం చేయాలని సూచించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న పేదవారికి ప్రతి ఒక్కరూ సాయపడాలని పిలుపునిచ్చారు.అనంతరం దివ్యాంగుడు పల్లి శ్రీనును ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో .గ్రామ ఉపసర్పంచ్ వడ్లమాని వెంకటరెడ్డి, ఎంపీటీసీ తుల్లిమెల్లి భాస్కర్, శాంతా రెడ్డి, గోలి సత్యనారాయణ రెడ్డి, టి ఎన్ ఎస్ ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గద్దె శివ, శ్రీనివాసరావు, రమేష్ రెడ్డి, టోకూరి యోబు, మారుమూడి థామస్,శేషు తదితరులు పాల్గొన్నారు.

## రోగికి మానవత చేయూత



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: పామాయిల్ గెలలు కోస్తుంగా గెడ కరెంటు తీగలకు తగిలి ఒళ్ళు కాలి జంగారెడ్డిగూడెం సాయిస్ఫూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టి.గంగాధర్‌కు ఆదివారం మానవత సంస్థ అధ్యక్షుడు మహంకాళి రంగప్రసాద్ ఆధ్వర్యంలో రూ.6500లు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా రంగప్రసాద్ మాట్లాడుతూ మానవత వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి చెప్పిన వధంగా ఆపదలో ఉన్న వారిని ఆదుకొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహంకాళి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు త్రిపుర రమేష్ , కోశాధికారి పల్లి వెంకటరెడ్డి, రీజియన్ చైర్మన్ దల్లి రామాంజనేయరెడ్డి, మేఘన తదితరులు పాల్గొన్నారు.

## శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు రెడ్డిగణపవరం రాక



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదివారం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం వద్ద గల పోలవరం నిర్వాసిత కాలనీ పాతూరుకు ఆదివారం వచ్చేశారు. చైర్మన్ మోషేన్‌రాజుకు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ కలిసి ఐఎస్‌డబ్ల్యు గన్‌మెన్‌నూనె మురళీకృష్ణ గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రప్రథమంగా వచ్చిన సందర్భంగా మోషేన్‌రాజుకు ఘన స్వాగతం లభించింది.

## ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు : పెదబాబు



ఏలూరు : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ముస్లిములు జరుపుకునే లిమిలాద్-ఉన్-నబీలి పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఏలూరు నగరంలో ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీ కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ ఎం ఆర్ పెదబాబు జెండా ఊపి ప్రారంభించారు. మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా ఆదివారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏలూరు నగరంలో పాత బస్టాండ్ సెంటర్ నుండి నగర పురవీధుల్లో భారీ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఎస్ ఎం ఆర్ పెదబాబు మాట్లాడుతూ ప్రవక్త జన్మదినాన్ని ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉ ందన్నారు. ఈ సందర్భంగా ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం 45వ డివిజన్ కార్పొరేటర్ షేక్ ఇలియాస్ పాషా,రాజా అహ్మద్, అస్లాంరజా, యాసీమ్, అస్లాంపాషా, అనీష్, అజ్మల్ తదితరులు ఆధ్వర్యంలో జరిగింది.

# పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## అగ్ని ప్రమాద బాధిత పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటాం : ఆర్డీఓ



ప్రభాతవార్త-ఏలూరు : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం వెల్లమిల్లి లో దేవీ నవరాత్రుల ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఊరేగింపులో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలో గాయపడిన పిల్లలను జిల్లా కలెక్టర్ వై. ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి తాడేపల్లిగూడెంలో ఆసుపత్రిలో ఏలూరు ఆర్డీఓ కె. పెంచల్ కిషోర్, ఉంగుటూరు తహసీల్దార్ వెంకటరమణ పరామర్శించారు. ప్రమాద ఘటనపై వివరాలను బాధితుల తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన పిల్లలకు మెరుగైన వైద్య సేవలందించాల్సిందిగా ఆసుపత్రి నిర్వాహకులను ఆర్డీఓ ఆదేశించారు. ప్రమాద ఘటనలో తీవ్ర గాయాలపాలైన వెల్లమిల్లి గ్రామానికి చెందిన దుర్గ చందు, గోడి వివేక్ లకు తాడేపల్లిగూడెం లోని హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారని, చిన్నపాటి గాయాలతో బయటపడిన కొక్కిరిపాటి మహేంద్రవర్మ, కొక్కిరిపాటి శశిధర్, అడబాల కారుణ్య, మెడవాంకుల వికాస్ కుమార్ లకు చికిత్స అందించగా ఇంటికి వెళ్లిపోయారని ఆర్డీఓ చెప్పారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, పిల్లలకు అందిస్తున్న చికిత్సను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని ఆర్డీఓ చెప్పారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల ననుసరించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు పిల్లల కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒకొక్క కుటుంబానికి 10 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయంను తహసీల్దార్ అల్లాడి వెంకటరమణ ఆదివారం ఆసుపత్రిలో అందించారు. సదరు ఇద్దరు పిల్లల ఆరోగ్య పరిస్థితిని, అందుతున్న చికిత్స వివరాలను ఆసుపత్రి డాక్టర్లను కలిసి వెంకటరమణ అడిగి తెలుసుకున్నారు. వెల్లమిల్లి అగ్ని ప్రమాద ఘటన తెలిసిన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తూ పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటకప్పుడు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, గట్టి నిఘా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు సంభవిస్తే సంబందించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి కార్యక్రమ నిర్వహణలో కనీస భద్రతా చర్యలు పాటించాల్సి ఉందని, కార్యక్రమ నిర్వాహకులు ఇటువంటి విషయాలను తప్పనిసరిగా పరిశీలించవలసి ఉందన్నారు.

## వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా

### ఘన నివాళులర్పించిన పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీరవి ప్రకాష్



భీమవరం అక్టోబర్ 11(ప్రభాతవార్త ) : రామాయణ మహా గ్రంథాన్ని రచించిన ఆదికవి శ్రీ వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ రవి ప్రకాష్ ఇతర పోలీస్ అధికారులు,జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ రామాయణాన్ని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ రామాయణం స్ఫూర్తితో కుటుంబ మరియు మానవతా విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవించాలని కోరారు. ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణమని, అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి గారని, ఆయన ప్రబోధించిన ఆశయాలను, పవిత్రమైన ఆలోచనలను ప్రతి ఒక్కరూ జ్ఞప్తి చేసుకోవాలని, స్వార్థచింతన, నాది, నేను అనే దురాశ నుంచి విముక్తి పొంది సన్మార్గంలో నడవడమే వాల్మీకి మహర్షికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు.

## పాములపర్రు లో అన్నసమారాధన ...

ఉండి, అక్టోబర్ .9.ప్రభాతవార్త : మండల పరిధిలోని పాములపర్రు గ్రామంలో దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఘనంగా అన్నసమారాధన కార్యక్రమం జరిగింది .ఈ సమారాధన కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేశారు .ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ,సర్పంచ్ ,కేసనశాంతి కుమారి, బ లుసుల రావు ,యాదగిరి, ఉమామహేశ్వరరావు, కోటేశ్వరరావు, సాయిరాం ,మంగిన హరిబాబు ,గంధం రాంబాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న మన్నారు .ఉత్సవాల నిర్వహణకు గ్రామ ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు .భక్తులు కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా కనకదుర్గమ్మ వారికి పేరు ఉందన్నారు .అమ్మ ఆశీస్సులు గ్రామంపై ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు .ఉత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు .

## అందుబాటులో పాము...కుక్కకాటు మందులు



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: పాము, కుక్క కాటుకు గురైన వారిని ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి వైద్యం పొందాలని వారికి సలహా ఇవ్వమని ఏరియా ఆసుపత్రి డవలప్‌మెంట్ సొసైటీ మెంబర్ రాపోలు భావన రుషి ఆదివారం తెలిపారు. ఏ ఇతర వ్యాధులకైనా వైద్యం పొందడానికి అన్ని వైద్య సేవలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీ మహిళలు ప్రసవం నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళి 40వేలు నుంచి 60వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందన్నారు.జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో ప్రసవానికి అయ్యే ఖర్చు పూర్తి ఉచితమని తెలిపారు. ప్రజలు, రోగులు ప్రభుత్వాసుపత్రిలోని వైద్యసేవలను వనియోగించుకుని ఆరోగ్యవంతులు కావాలని భావన రుషి ఆకాంక్షించారు.

## గంగానమ్మ ఆలయంలో మహాన్నసమారాధన



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం పట్టణంలోని గంగానమ్మవారి ఆలయంలో ఆదివారం మహాన్నసమారాధన నిర్వహించారు. వేలాదిమంది భక్తులు విచ్చేసి అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాగా, అమ్మవారికి శ్రీలలిత సూర్య స్వీట్స్ వారు సమర్పించిన 99 కిలోల లడ్డూను పట్టణ ప్రముఖ/లు వందనపు వెంకటేశ్వరరావు - సాయిబాలపద్మ దంపతులు లక్షా 11వేల రూపాయలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే, భక్తాంజనేయ స్వామి స్వీట్స్ వారు సమర్పించిన 81 కిలోల లడ్డూను వానవ సాయి నగేష్ రూ.40వేలకు వేలంపాటలో దక్కించుకున్నారు. అనంతరం లడ్డూ పాటదారులను ఆలయ కమిటి వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి - చిన్న, జెట్టి గురునాధరావు, మండవల్లి సోంబాబు, పరిమి సత్తిపండు, పోల్నాటి బాబ్జీ, వందనపు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇటు ఆగని వర్షం ... అటు దగ్గరపడిన జగనన్న సభ

నరసాపురం-ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఎట్టకేలకు ఖరారైందనుకుంటే ఆ ఆనందాన్ని వైసిపి కార్యకర్తలకు వానదేవుడు నిలిపేలా లేదు. జగన్ వస్తున్నారనే వార్తతోపాటే వర్షంకూడా వెనకాలే మొదలైంది. గత నాలుగు రోజుల నుండి సాధారణ స్థాయి నుండి కుంభవృష్టిగా పడుతోంది. దీంతో ఆ పార్టీ కార్యకర్తలతోపాటు నియోజకవర్గ ప్రజల్లో కూడా ఈ వాతావరణంలో సిఎం జగన్ వస్తారంటారానే డిస్కర్షన్ జోరుగా సాగుతోంది. అయితే అధికారులు పార్టీ యంత్రాంగం ముఖ్యమంత్రి పర్యటనకు సంబందించిన పనులను మాత్రం ఎక్కడా వానకు తగ్గకుండా ఎదురెళ్లుతున్నారు. పనులను కూడా చకచకా చేయిస్తున్నారు. ముఖ్యమంత్రి 14వ తేదీన నియోజకవర్గంలో పూర్తి సమయాన్ని కేటాయిస్తారు. తొలుత రైల్వేస్టేషన్ సమీపంలో గల చుండూరి అపార్ట్‌మెంట్ సైట్‌లో హెలికాప్టర్‌లో దిగుతారు. అక్కడి నుండి అధ్వానంగావున్న రోడ్లకు సొగసులద్దుతున్నారు. గత రెండు నెలలుగా నరకంప్త్ర& చూపిస్తున్న వైఎస్సార్ స్టేట్యూ నుండి రైల్వే క్రాస్ రోడ్డు వరకు రోడ్డు నరకాన్ని మించివుంది. అయినా సరే అటు రైల్వే అధికారులు గానీ ఇటు మున్సిపాలిటీ గానీ మరే శాఖ కూడా మనకు సంబందమేముంది అన్నట్లుగానేవున్నారు. గోతుల్లో భారీ వాహనాలు దిగబడి నానా యాతన పడ్డారు. ఆదివారం ఈ రోడ్డును మరమ్మత్తు చేసారు. దీంతో జనం జై జగన్ జైజై జగన్ అంటున్నారు. మరోవైపు జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభ జరిగే నక్కావారిపేట మైదానంలో చేపల పెంపకానికి సిద్ధంగా అన్నట్లుగా చెరువులామారింది. ఇందులో నీరును ఇంజన్లతో తోడిస్తున్నారు. ఇంతకు ముందు ఈ ప్రాంగణంలో పవన్ కళ్యాణ్ సభ జరిగింది. ఇక్కడే జగన్ మోహన్‌రెడ్డి జభ పెట్టడానికి ఇదో కారణం. పవన్ కన్నా జగన్‌కే జనం ఎక్కువ అనే టాక్ కోసం సభను ఇక్కడ పెట్టారని జనం ఉవాచ. అందుకు తగ్గట్టుగా పార్టీ కూడా కసరత్తు చేస్తోంది. పార్టీలోని శ్రేణులకు వాలంటీర్లకు డ్వాక్రా మహిళలకు గ్రామీణ



ప్రజాప్రతినిధులకు పార్టీ అభిమానులకు ఇప్పటికే నియోజకవర్గ నాయకత్వం నుండి జన సమీకరణకు జాబులు అందాయి. స్వచ్ఛందంగా సభకు జనం రావాలని ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమానికి ప్రతిస్పందనగా సభ ఆకట్టుకోవాలని పార్టీ నాయకులు ఎక్కడికక్కడ సమావేశాలు పెట్టి చెబుతున్నారు. జగన్ మోహన్‌రెడ్డి నరసాపురం ఎన్నికల ముందు వచ్చారు. ఆ తరువాత ఈ నియోజకవర్గానికి రాలేదు. ఇదే తొలిసారి. అదికూడా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఓంకారం చుట్టడం కోసం రావడంతో ప్రజలు కూడా ముఖ్యమంత్రిని చూసేందుకు వెళ్లాలని అమ్మఒడి, చేయూత, కాపునేస్తం, విద్యాకానుక వంటి పథకాల ద్వారా అందుకున్న నగదుకు కృతజ్ఞతగా ఆయన ముందు నిలవాలని తలపోస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి జనం బాగా వచ్చేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు. అయితే ఈ ఆనందానికి వర్షం మాత్రం బ్రేక్ వేసేలానే కనబడుతోంది. ఎన్ని ఏర్పాట్లు చేసినా పొడి వాతావరణంలో జరిగే సభకు చినుకుచినుకు పడుతూ చిందరవందరగావుండే వాతావరణానికి చాలా తేడావుంటుంది. ఆ పరిస్థితి దాటుకోవాలని వానదేవుణ్ణే కాదు వేయిదేవుళ్లను పార్టీ శ్రేణులు మొక్కుతున్నారు.

# కలెక్టర్‌ను కలిసిన కొత్త సబ్‌కలెక్టర్



నరసాపురం -ప్రభాతవార్త : నరసాపురం సబ్‌కలెక్టర్‌గా ఎం. సూర్యతేజ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆదివారం భీమవరంలో జిల్లాకలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా వారిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. కలెక్టర్ పి. ప్రశాంతి నరసాపురం సబ్ డివిజన్ పరిస్థితులపై ముఖ్యమంత్రి జగన్ పర్యటనపై ఆయనతో మాట్లాడారు.

# రాజధానికై రాజీలేని పోరు

నరసాపురం -ప్రభాతవార్త : అమరావతిని రాజధాని చేసేంతవరకు విశ్రమించేదిలేదని అమరావతి నుండి అరసవల్లి వరకు జరిగే పాదయాత్రలో భాగంగా నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొన్నారు. దేశం నాయకులు పీతాని సత్యనారాయణ, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడులతోపాటే ర్యాలీలో హాజరయ్యారు. ఆదివారం ఆచంట నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రకు ప్రజల నుండి ఎంతో స్పందన వచ్చిందన్నారు. రాజధానికోసం భూములు ఇచ్చిన రైతులను ప్రభుత్వం మోసగించిందన్నారు. మూడు రాజధానులు కేవలం ప్రభుత్వం డ్రామా తప్ప అందులో




ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఒక్క రాజధానికే దిక్కులేని పరిస్థితిలో మూడు రాజధానులకు నిధులు ఎక్కడ తేగలరని ప్రశ్నించారు.

# పోలవరం ఏఎంసీ చైర్మన్ పదవి ఎవరిని వరించేనో...?

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: ఏలూరు జిల్లా పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటి (ఏఎంసీ) చైర్మన్ పదవ ఈ పర్యాయం ఎవరిని వరించనున్నదో అని వైసీపీ నాయకులు ఊహానాగాల్లో ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం అప్పటి వరకు అసెంబ్లీ నియోకవర్గానికి పరిమితం కాకుండా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామాలతో ఏఎంసీలు ఏర్పడ్డాయి. దీంతో రైతాంగం అనేక ఇబ్బందులు పడ్డారు. రైతులందరికీ సులభతరంగా మార్కెటింగ్ సేవలందించడానికి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఏఎంసీలను ఏర్పాటు చేశారు. దీంతో అప్పటి వరకు జంగారెడ్డిగూడెం పరిపాలనా కేంద్రంగా ఉన్న పోలవరం ఏఎంసీని పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామాలతో కలిపి కొయ్యలగూడెం మార్కెట్‌యార్డులో పరిపాలనా కేంద్రంగా ఏర్పాటు చేస్తామని పోలవరం ఏఎంసీని రూపాన్ని మార్చివేశారు. నూతనంగా ఏర్పడిన పోలవరం ఏఎంసీకి ప్రప్రథమ చైర్‌పర్సన్ కరాటం సీతాదేవిని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ఆమోదంతో ప్రభుత్వం నియమించింది. బుట్టాయగూడెంకు చెందిన కరాటం సీతాదేవిని ఓసీ జనరల్ కోటాలో మొట్టమొదటి మహిళా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అగ్రికల్చరల్ అండ్ కోఆపరేటివ్ (మార్కెటింగ్) వాఖ జీవో నెం.717ని 2020 అక్టోబరు 18వ తేదిన నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటికి పోలవరం ఎమ్మెల్యే బాలరాజు గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. వైస్‌చైర్మన్‌గా ఎస్‌వీపీకేహెచ్.వెంకటరామభద్రరాజుతో పాటు మొత్తం 20 మందితో పాలకవర్గం ఏర్పడింది. ఈ పాలకవర్గంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల రైతు ప్రతినిధులకు పదవులు లభించాయి. కరాటం సీతాదేవి చైర్‌పర్సన్‌గా ఈ పాలకవర్గం ఈ నెల 14వ తేదితో పూర్తి కానుంది. దీంతో నూతన పాలకవర్గాన్ని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు సూచనల మేరకు ప్రభుత్వం నియమించవలసి ఉంది. రెండేళ్ళు పూర్తయిన ఈ పాలకవర్గం అనంతరం నూతన పాలకవర్గంలో చైర్మన్ పదవి కోసం పలువురు అధికార పార్టీ నాయకులు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. తిరిగి కరాటం సీతాదేవికే ఈ పదవి వరిస్తుందో... లేదా మరెవరికైనా ఎమ్మెల్యే బాలరాజు అవకాశం కల్పిస్తారో ? ప్రస్తుతం పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలోని ఏఎంసీలకు వారి పదవీ కాలం అనంతరం నూతన పాలకవర్గం గత కొద్ది రోజుల నుంచి ప్రభుత్వం ఆయా ఎమ్మెల్యేల సూచనలు, సలహాలు, అభీష్టాల ప్రకారం నియమిస్తున్నారు. ఈ పర్యాయం రెండవ చైర్మన్‌గా పోలవరం ఏఎంసీ పదవి ఎవరిని వరించనున్నదో ? ఎమ్మెల్యే బాలరాజు అతి త్వరలోనే నూతన పాలకవర్గం పేర్లను పంపడానికి, నాయకుల పేర్లను పరిశీలిస్తున్నట్లు ప్రభాతవార్తకు సమాచారం అందింది. ఈ నెలాఖరు లోగా పోలవరం ఏఎంసీకి నూతన పాలకవర్గం ఏర్పడే అవకాశం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పాలకవర్గంలో పదవులు పొందే నాయకులు ఎవరో...?

# అభివృద్ధి సంక్షేమం రెండుకళ్లు

అత్తిలి -ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ప్రజలకు అభివృద్ధి సంక్షేమం అనే వాటిని రెండు కళ్లుగా భావించి ప్రజలకు అందిస్తోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం,లక్ష్మీనారాయణపురంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కులంమంతం పార్టీలు అనేవాటికి అతీతంగా ముఖ్యమంత్రి అందరికి సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలనేదే మూడు రాజధానుల లక్ష్యమని దీన్ని కావాలనే ప్రతిపక్షం రాజకీయం చేస్తోందన్నారు. ప్రతిగ్రామంలోనూ విద్యుత్, డ్రయినేజి, మంచినీరు సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేసారన్నారు. దంతుపల్లి, ఉనికిలి గ్రామాల్లో జరిగిన సభల్లో కూడా మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా



ఆయనను ఘనంగా సత్కరించారు. ఎఎంసి చైర్మన్ బుద్ధరాజు భరణీప్రసాద్, మండల అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్‌లు వట్టికూటి అనంతలక్ష్మి, దొమ్మేటి రమ్య, ముదునూరి దుర్గాభవాని, రంభ సూరిబాబు, తహశీల్దారు రామాంజనేయులు, ఎంపిడివో వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంగా చెత్త సంపద కేంద్రం



నిడమర్రు, అక్టోబరు 9, ప్రభాతవార్త: మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రం అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. గ్రామంలోని కొందరు రాత్రింబవళ్ళు అనే తేడా లేకుండా చెత్త సంపద కేంద్రాన్ని పేకాట స్థావరంగా మారుస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి అసాంఘీక కార్యకలాపాలను అడ్డుకోవాలని పోలీసు వారిని కోరుతున్నారు.

# చేగువేరా 55వ వర్ధంతి

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: విప్లవ వీరుడు చేగువేరా 55వ వర్ధంతిని ఆదివారం స్థానిక ధర్మన్న స్మారక భవనంలో ఇఫ్టూ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత చేగువేరా చిత్రపటం వద్ద ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కర్రి సూర్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ.రమణ మాట్లాడుతూ చేగువేరా అంటే ఒక ఫ్యాషన్ కాదని, ఒక విప్లవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల పుల్లారావు, కోట శివకృష్ణ, కర్రి సూర్యం, వనపర్ల నవీన్, బాలిన ధర్మరాజు, గెడ్డం రమేష్, తియ్యాల గణేష్, పుచ్చల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ముత్యాలమ్మను దర్శించిన ఎమ్మెల్యే బాలరాజు

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: తెలంగానా రాష్ట్రం అశ్వారావుపేట మండలం వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మవారిని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట పోలవరం నియోజకవర్గంలోని పలు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# మద్దిలో కార్తీక మహోత్సవాలకు పూజా కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామివారి దేవస్థానంలో ఈ నెల 26వ తేది నుంచి కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లకు ఆదివారం ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు, అర్చకులు, వేద పండితులు రాట పాతి శ్రీకారం చుట్టారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కీసరి సరితా విజయభాస్కర్‌రెడ్డి, దండు వెంకటకృష్ణంరాజు, మానికల బ్రహ్మానందరావు, బల్లే నాగమణి, ప్రత్యేక ఆహ్వానితులు కర్పూరం రవ, ఆలయ ఈవో ఆకుల కొండలరావు పాల్గొన్నారు.



# ధ్యానం అంతిమ లక్ష్యం...ఆనందం

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: ధ్యానం అంతిమ లక్ష్యం ఆనందమని పిరమిడ్ మాస్టర్ ఇమ్మడిశెట్టి శోభారాణి అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం శేషాద్రినగర్ శ్రీగౌరీ సుభద్ర పిరమిడ్ ధ్యాన కేంద్ర అనుబంధ మైత్రేయ మందిరంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ నిర్వహణలో ఒక రోజు ఆత్మజ్ఞాన - ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ ఆశయ సాధన విశ్వశ్రేయస్సే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి తటవర్తి కృష్ణ, పాలడుగుల సురేష్,



రామానుజం తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యలపై పనిచేయాలి

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: వకలాంగుల సమస్యలపై రానున్న మూడేళ్ళ కాలంలో నూతన కమిటి పనిచేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్ల అధ్యక్షురాలు ఎస్‌కె.సుభాషిణి అన్నారు. ఆదివారం జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడారు. వికలాంగుల రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆవుల సత్యనారాయణ, రవకుమార్, రామచంద్రరావు, శంకురయ్య, మస్తాన్, సుభేదార్ రాజు తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మెల్యే కోలుకోవాలంటూ సర్వమత ప్రార్థనలు

జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆదివారం జంగారెడ్డిగూడెం పట్టణంలో వైసీపీ నాయకులు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. గ్రామద ఏవత గంగానమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే, మసీదు, చర్చిలలో ప్రత్యేకప్రార్థనలు జరిపారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి - చిన్న, వైసీపీ నాయకులు తడికమళ్ళ మురళీ, వందనపు వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్, లోకారపు వెంకటేశ్వరరావు (ఎల్‌వీఆర్), పార్టీ నాయకులు గెద్దాడ శ్రీనివాసరావు, మంగా రామకృష్ణ, మొల్ల సురేష్, గంజి విశ్రీనోద్, షేక్ అమీర్, పెసరగంటి త్రిమూర్తులు, రాపోలు భావన రుషి, వలిపర్తి నూకరాజు, సాబోలు రవికుమార్,



షేక్ జిలానీ, కాసర సురేష్‌రెడ్డి, దున్నా బుజ్జి, తల్లాడ సంజయ్, గుబ్బల అభ్యాస్, ఈలి సత్తిబాబు, లక్ష్మణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## జంగిల్ క్లీయరెన్స్ పనులు చేయకపోవడంతో... .త్రాగునీటి పథకాలు మరమ్మత్తులకు లక్షల్లో వ్యయం..సర్పంచులు

రాజవొమ్మంగి, అక్టోబరు 8, ప్రభాతవార్త : గ్రామాల్లో విద్యుత్ సరఫరా వెళ్లే విద్యుత్ లైన్ కూడా జంగిల్ క్లీయరెన్స్ పనులు చేయకపోవడం వలన లోఓల్టేజీ, ఒక్కోసారి హైఓల్టేజీ విద్యుత్ సమస్య వలన ప్రతీ ఇంటిలో ఉండే విలువైన ఫ్రిజ్, టి.వి.తో బాటు ఇతర వస్తువులు నష్టం జరుగుతుంది. గ్రామాల్లో త్రాగునీటి పథకాలు విద్యుత్ మోటార్లు కాలిపోయి వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని మారేడుబాక సర్పంచ్ తొంటా ఆదిరాజు, వంచంగి సర్పంచ్ కాంతం, గడు ఓకుర్తి సర్పంచ్ సవిరాల చంద్రుడు, వాతంగి సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి తెలిపారు. విద్యుత్ మోటార్లు మరమ్మత్తులు చేసి ఏర్పాటు చేసేవరకూ ప్రజలకు త్రాగునీరు ఉండదు. నిత్యావసరాల్లో నీటి కోసం చేతిపంపులు వద్ద బారులు తీరాల్సిందే. ఈ సమయంలో చేతిపంపులు కూడా పనిచేయకపోతే వాగుల్లో నీరు త్రాగి టైపాయిడ్, డయేరియా వంటి వ్యాధులకు గురై ఆసుపత్రులకు వెళ్ల వలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పుడు రాజవొమ్మంగి మండలంలో జంగిల్ క్లీయరెన్స్ పనులు చేయలేదు. లోదొడ్డి పంచాయితికు వెళ్లే విద్యుత్ లైన్ జంగిల్ క్లీయరెన్స్ పనులు చేయలేదని సర్పంచ్ లోతా రామారావు ఇప్పటికే వెల్లడించారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. జంగిల్ క్లీయరెన్స్ పనులు చేయలేదనే విషయాన్ని అధికారి ధృవీకరిస్తున్నారు.. రాజవొమ్మంగి సబ్ స్టేషన్ లో బయోమెట్రిక్ హాజరు లేకపోవడం వలన కనీసం కార్యాలయంలో విధుల్లో ఉండే వారు ఎవరనే విషయం ఉన్నత స్థాయి అధికారులకు తెలియని స్థితి ఏర్పడింది.. విద్యుత్ సమస్య వల్ల ఒక్క గడుఓకుర్తి పంచాయితిలో గల దోనెలపాలెం, గొబ్బిలమడుగు, చీడిపాలెం, బోనంగిపాలెం గ్రామాల్లో ఉన్న 7 త్రాగునీటి పథకాల మోటర్లు మరమ్మతులు గురైతే ఒక్కో కొత్త మోటార్ కొనుగోలు రూ.20 వేలు వంతున రూ. 3 లక్షలు ఖర్చు చేశానని సర్పంచ్ సవిరాల చంద్రుడు తెలిపారు. ఒక్కో మోటార్ రెండు సార్లు పోయిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వాతంగి పంచాయితీలో వాతంగి, కోమరాపురం, ఓకుర్తి ఉన్న మూడు త్రాగునీటి పథకాల మోటార్లు మరమ్మతులకు రూ..60



వేలు ఖర్చు అయ్యిందని సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి తెలిపారు.. వంచంగి పంచాయితిలో రూ.56 వేలు మోటార్ ఏర్పాటు కు ఖర్చు అయ్యిందని సర్పంచ్ కె.కాంతం అన్నారు..

## జగన్ ప్రభుత్వం లో మహిళలకు రక్షణ లేదు

కాకినాడ సిటీ, అక్టోబర్ 9,(ప్రభాతవార్త) : కరప మండలం కురాడా గ్రామం లో అమ్మమ్మ గారి ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్న కుమారి కాద దేవిక శనివారం మానవ మృగం చేతిలో మృతి చెందిన విషయం తెలుసుకున్న సుంకర పావని తిరుమల కుమార్, చాపల లీలా ప్రశాంతి, ఆదివారం ఉదయం కాకినాడ ప్రభుత్వాసుపత్రి మార్చురీ కి వెళ్లి తల్లితండ్రులను కుటుంబ సభ్యులు ను పరామర్శించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గా పదవీ బాధ్యతలు స్వీకరించిన జగన్మోహన్ రెడ్డి పరిపాలన లో ఈ మూడున్నార సంవత్సరాలు లో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఈ ప్రభుత్వం లో హత్య లకు గురైన మహిళల కుటుంబాలకు ఎవరికి న్యాయం జరగలేదు అన్నారు, ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి శ్రీమతి లీలా ప్రశాంతి మాట్లాడుతూ



దిశా చట్టం గురించి జగనన్న ప్రభుత్వం పబ్లిసిటీ "పీక్" మహిళలకు రక్షణ కల్పించడంలో ,"వీక్" అన్నారు, దేవిక కుటుంబ సభ్యులు కు న్యాయం జరిగే వరకూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

## దివంగత జక్కంపూడికి నివాళులు

అమలాపురం, అక్టోబరు9,ప్రభాతవార్త : అమలాపురం పట్టణ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ జక్కంపూడి రామ్మోహన్ రావు వర్థంతి సందర్భంగా స్థానిక నల్లవంతెన వద్ద నున్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జక్కంపూడి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, టౌన్ ప్రెసిడెంట్ సంసాని వెంకట చంద్రశేఖర్,రాష్ట్ర పుడ్ కమిటీ సభ్యులు జక్కంపూడి కిరణ్, వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, వార్డ్ కౌన్సిలర్లు మట్టపర్తినాగేంద్ర,కొల్లాటి దుర్గాబాయి, నాగవరపు వెంకటేశ్వరరావు,చిత్రపు రామకృష్ణ, చిట్టూరి పెదబాబు,దొంగ చిన్న,కట్రోజు సన్నయ్యదాసు తదితరులు పాల్గొన్నారు.

## దాంపత్య జీవితంలో ( మొబైల్ ) చరవాణి

### - సంసారాలను కూల్చివేస్తున్న చరవాణి సందేశాలు , సంభాషణలు
### - గుర్తు తెలియని వ్యక్తులతో సంబంధాలు , విడాకుల కోసం కోర్టుమెట్టులెక్కుతున్న జంటలు
### - హత్యలకు వెనుకాడని వివాహేతర సంబంధాలు , అనాధలవుతున్న చిన్నారులు

అయినవిల్లి, అక్టోబర్ 9 ( ప్రభాత వార్త ) : ఉమ్మడి కుటుంబాలు ఉన్న రోజుల్లో అందరు కలిసిమెలసి ఉండేవారు. రాను రాను ఉమ్మడి కుటుంబాలలో అన్నదమ్ములు , అక్క చెల్లెళ్ళ బంధాల నుండి విడిపోయి వేరువేరు కాపురాలు , ఎవరి కుటుంబ బాధ్యతలు వారివి అన్నట్టు వేరుగా ఉండటం , ధరలు , ఖర్చులు , జల్సాలు పెరగడం వల్ల భార్య , భర్త పనులకు వెళ్ళటం అక్కడ ఇరువురు ఎవరో ఒకరికి ఏదో రకంగా ఆకర్షితులయ్యి చరవాణి సందేశాలు , సంభాషణలతో ఇంటికి వచ్చిన భార్యాభర్తల సంబంధాలకన్నా వివాహేతర సంబంధాలకే ఎక్కువగా విలువ ఇస్తున్నారు. కొందరు భార్యకు తెలియకుండా భర్త , భర్తకు తెలియకుండా భార్య వాడటం , చరవాణి రూపంలో వివాహేతర సంబంధాలు మితిమీరి భార్య భర్తను , భర్త భార్యను , కొంతమంది అడ్డుగా ఉంటున్నారని చిన్నారులను సైతం హత్య చేయడానికి వెనకాడటం లేదని , నిత్యం ఏదోచోట ఇటువంటి సంఘటనలు చూడాల్సి వస్తుందని పెద్దలు వారి వారి అనుభవాన్ని తెలుపుతున్నారు. చరవాణి అభివృద్ధి అయిన కొద్ది హత్యలు ఎక్కువగా పెరుగుతున్నాయని , చరవాణి అవసరానికన్నా ఎక్కువగా ఉపయోగించడం వల్ల అనారోగ్యాలకు దారితీస్తుందని కొందరు వృద్ధులు వారి అనుభవాలను తెలుపుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేనప్పుడే సంసారాలు సజావుగా సాగేవి. పూర్వం రోజుల్లో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందరూ కలసి మెలసి అన్యోన్యంగా ఉండేవారు. ఎవరైనా విడిపోతున్నారు అంటే



వారిని మందలించి వారిని విడిపోకుండా కలిపేవారు. అందరూ కలసికట్టుగా హాయిగా కబుర్లు చెప్పుకుంటూ ఆనందంగా గడిపేవారు. అయితే ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం పెరగడం , చిన్నపిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు అందరి చేతుల్లో చరవాణీలు ( సెల్ ఫోన్లు ) ఉంటున్నాయి. చరవాణి నిత్యవసర వస్తువు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడిదే పెను అనుమానాలకు , హత్యలు , ఆత్మహత్యలకు దారి తీసేలా చేస్తోంది. సోషల్ మీడియా ప్రభావం మానవులపై ఎంతగానో పడింది. ప్రపంచంలో ఇంటర్నెట్ ఉపయోగించే దేశాల్లో భారతదేశం రెండవ స్థానంలో ఉందంటే ఇక్కడ సెల్ ఫోన్లకు ఎంత ఎలా బానిసలయ్యామో అర్థం అవుతుంది. వాట్సాప్ , ఫేస్ బుక్ , ట్విట్టర్ , ఇంస్టాగ్రామ్ అకౌంట్లు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

## రొయ్యల రైతాంగాన్ని దోచుకుంటున్న సిండికేట్.

అమలాపురం,అక్టోబర్9,ప్రభాతవార్త : ఆక్వా రైతు సమస్యలపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సీరియస్ గా తీసుకుని తక్షణచర్యలు చేపట్టడం పట్ల కోనసీమ ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక క్షత్రియ పరిషత్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి కోనసీమ ఆక్వా అసోసియేషన్ అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు అధ్యక్షత వహించారు.అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు త్సవటపల్లి నాగభూషణం మాట్లాడుతూ ఆక్వా రైతుల ఫిర్యాదులపై సీఎం స్పందిస్తూ ముగ్గురు మంత్రులు, సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటుచేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సరిగ్గా ఆక్వా పట్టుబడి సమయంలో ఎక్సపోర్టర్స్ సిండికేట్ గా మారి ధరలను దారుణంగా తగ్గించి రైతులకు నష్టాలు మిగులుస్తున్నారని నాగ భూషణం ఆందోళన వ్యక్తం చేశారు.ఆక్వా ఫీడ్ ధరల్ని దారుణంగా పెంచి రైతులకు నష్టం మిగులుస్తున్నారని అన్నారు. రైతులకు అండగా నిలిచేందుకు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చినా సిండికేట్గా మారి రైతులను నష్టపరచడంపై సిఎం స్పందించిన ఎక్సపోర్టర్స్ లో మార్పు రానందున ఈ నెల 10 న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్



కోనసీమ జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసేందుకు సన్నద్ధం అవుతున్నట్లు నాగభూషణం వెల్లడించారు.ఆక్వా రైతులంతా కలెక్టరేట్ కు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో యాళ్ళ వెంకటానందం, అల్లూరి రమేష్ రాజు , దెందుకురి సత్తిబాబు రాజు, సయ్యపరాజు సత్తిబాబు రాజు, బండిగుప్తాపు పాండురంగ , చిట్నీడి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి గొల్లపల్లి

అయినవిల్లి,అక్టోబర్ 9 ( ప్రభాత వార్త ) : అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం గ్రామంలో ఇటీవల కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండల టిడిపి మాజీ అధ్యక్షులు సలాది బాబురావు , మాజీ సర్పంచ్ ముద్రగడ బాబ్జిలను వారి వారి నివాస గృహాలలో కలసి ఆదివారం మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు యోగక్షేమాలు తెలుసుకున్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి వెంట మాజీ ఎంపిపి సలాది పుల్లయ్య నాయుడు, గ్రామశాఖ అధ్యక్షులు మేడిశెట్టి సత్తిబాబు, పి హెచ్ సి మాజీ ఛైర్మన్ అడపా నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ దామిశెట్టి రామకృష్ణ, దామిశెట్టి దొరబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు మేడిశెట్టి అంజిబాబు, శ్రీరెడ్డి



సుబ్బారావు, జక్కపు సూరిబాబు, దామిశెట్టి చిట్టిబాబు, సలాది సత్తిబాబు, గాలిదేవర ఈశ్వరావు , గుర్రం రాంబాబు తదితరులున్నారు.

## లిటిల్ ఫ్లాక్ లూథరన్ చర్చి లో భక్తి శ్రద్ధలతో కృతజ్ఞతార్పణల పండుగ

రావులపాలెం, అక్టోబరు 09, ( ప్రభాతవార్త) : లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయంలో సంఘ సభ్యులు భక్తి శ్రద్ధలతో కృతజ్ఞతార్పణల పండుగ(కోత పండుగ)ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం లిటిల్ ఫ్లాక్ లూథరన్ దేవాలయంలో చైర్మన్ కప్పల వరప్రసాద్ (సి.ఆర్) ఆధ్వర్యంలో రెవ, కప్పల డామియన్ ఇశ్రాయేల్ అధ్యక్షతన జరిగిన కృతజ్ఞతార్పణల పండుగకు ముఖ్య అతిధిగా రెవ,పి.డేవిడ్ రాజు హాజరయ్యారు. సంఘ సభ్యులు కృతజ్ఞతార్పణగా సమకూర్చిన వివిధ రకాల ఫలాలు,పండ్లు,పిండి వంటలు,నూతన వంటకాల స్టాల్స్ సమకూర్చి దేవాది దేవునికి మహిమార్థమై దైవాశీస్సులు పొందులాగున ప్రదర్శించారు. ఈ సందర్భంగా రెవ,పి.డేవిడ్ రాజు మాట్లాడుతూ యెహొవా ధర్మశాస్త్ర ప్రకారం ప్రజలు పండించిన పంటలో ప్రధమ ఫలాలను ఎంతో భక్తి శ్రద్ధలతో దేవాలయానికి తీసుకొని వచ్చి దేవునికి సమర్పించడం ద్వారా



దేవుని ఆశీర్వాదాలు వారి పంటలపై ఉంటాయన్నారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ తిమోతీ ప్రకాశరావు,పాస్టర్ స్రుజన్ రాజు,డా,వీరబ్బాయి,డా,అనితా రామకృష్ణ, ఎంపిడిఓ జి.రాజేంద్రప్రసాద్,కోట రామకృష్ణ, గెడ్డం కనకరాజు,వి.విజయభాస్కర్,ఎ.ఏసురత్నం,బాలాజీ సంఘ సభ్యులు,యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## రాజుపేటలో సినిమా చిత్రీకరణ సందడి

రాజవొమ్మంగి, అక్టోబరు 9, ప్రభాతవార్త : అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలం బడదనాంపల్లి పంచాయతీ రాజుపేట గ్రామసమీపంలో ఆదివారం సినిమా చిత్రీకరణ జరిగింది. డైరెక్టర్ శ్రీనివాస్ గవిరెడ్డిగా రూపొందుతున్న ఈ సినిమా లో హరీష్, బెనర్జీ లపై ఇక్కడ చిత్రీకరణ చేశారు. భారీగా చిత్రీకరణ ను చూడటానికి జనాలు తరలివచ్చారు. కోడైరెక్టర్ భూపతి, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ సినిమా రూపొందుతుందని డైరెక్టర్ అన్నారు. నాతవరం వైస్సార్సీపీ నేత రజాక్ పాల్గొన్నారు.



## వైసీపీ పాలనలో ఊరుకో ఉన్మాది

### - మాజీ ఎంఎల్ఏలు వనమాడి కొండబాబు,పిల్లి అనంతలక్ష్మి

కాకినాడ సిటీ, అక్టోబర్ 9,( ప్రభాతవార్త) : వైసీపీ పాలనలో ఊరుకో ఉన్మాది తయారై మహిళలను లైంగిక వేధింపులు హత్యలకు గురిచేస్తున్నారని మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి లు విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఆదివారం వివేకానంద పార్కు నందు కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు చిక్కాల రామచంద్రరావు కాకినాడ రూరల్ మాజీ శాసన సభ్యురాలు పిల్లి అనంతలక్ష్మి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిక్కాల, వనమాడి మాట్లాడుతూ ఆడ పిల్లల ఇష్టా ఇష్టాలతో సంబంధం లేకుండా ప్రేమించానని వేధించడం, ప్రేమించలేదని చంపే మానవ మృగాలకు సభ్య సమాజంలో సంచరించే అర్హత లేదని, మహిళలపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నేరస్తులకు, ఇలాంటి ఉన్మాదులకు సకాలంలో శిక్ష పడితే ఇలాంటి నేరాలు చేయడానికి భయపడతారని, నేటి వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. మాజీ శాసనసభ్యురాలు పిల్లి అనంతలక్ష్మి మాట్లాడుతూ నేటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆడపిల్లలను చదువుకోసం బయటకు పంపడానికి తల్లిదండ్రులు




భయపడుతున్నారని ఆడపిల్లలకు నేటి సమాజంలో రక్షణ లేకుండా పోయిందని అధికార పార్టీ అండదండలతో ఉన్మాదులు పెట్రేగు పోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు తుమ్మల సునీత, నగర అధ్యక్షురాలు చిక్కాల సత్యవతి, మల్లిపూడి నాగ దీపిక, మీసాల సునీత, ప్రధాన కార్యదర్శి కొళ్లు కుమారి, దేవు జయలక్ష్మి, కొపనాతి నాగకుమారి, రిక్కా లక్ష్మీ, వడిసెల దానిమ్మ, కడలి వరలక్ష్మి, సరగడ వెంకటలక్ష్మి, ఒళ్లుగుల్ల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధానం చేసుకోవాలి.. జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు..

అంబాజీపేట, అక్టోబర్ 09, ప్రభాతవార్త : ప్రతీ ఒక్కరు తమ ఓటరు కార్డును ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సీఎచ్. సత్తిబాబు అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని పోలింగ్ బూత్ ల వద్ద నిర్వహిస్తున్న ఓటర్ అనుసంధాన ప్రక్రియను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు ఆధార్ అనుసంధాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా మండలాల పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం ఓటర్ కార్డు, ఆధార్ అనుసందాన ప్రక్రియను స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 70 శాతం పూర్తి చేశామన్నారు. ఆధార్ అనుసంధానంలో జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 అర్హత



ఆధారంగా నవంబర్ 9 నుంచి ఓటర్ల జాబితా సవరణను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఓటరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తగా చేరాలనే ఓటరు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు సిహెచ్.వెంకటరమణ, జి,కోమలి తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96,
Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps